సీఎం సిద్ధం సభకు జనం

టార్గెట్ 4 లక్షలు



డివైడర్ తవ్వేసి, కాల్వ పూడ్చేసి.. సభకు సిద్ధం

పార్టీ శ్రేణుల భారీ సమీకరణకు నేతల పాట్లు

- ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 1600 ఆర్టీసీ బస్సుల తరలింపు
- 79 కాలేజీలు, 112 స్కూల్ బస్సుల మళ్లింపు
- పాఠశాలలు, కళాశాలలకు అనధికారిక సెలవు
- భారీగా మోహరించిన పోలీసులు
- కాల్వల పూడ్చివేత.. డివైడర్ల తొలగింపు



ఏలూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గత నెల భీమిలిలో నిర్వహించిన సీఎం 'సిద్ధం' బహిరంగ సభకు ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి మూడు లక్షల మంది వస్తారని అంచనా వేశారు. కాని, ఆ స్థాయిలో రాకపోవడంతో ఇప్పుడు శనివారం ఏలూరు సమీపంలో జరిగే సభపై వైసీపీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. దీనికి ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి సుమారు నాలుగు లక్షల మంది రావాలని పార్టీ పెద్దలు టార్గెట్ విధించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి దాదాపు 1600 ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు కళాశాలలు, స్కూల్స్ బస్సులను వైసీపీ నాయకులు పార్టీ శ్రేణుల సమీకరణకు ఉపయోగిస్తున్నారు. వీరి ఖర్చుల నిమిత్తం ప్రతి బస్సుకు రూ.10 వేల చొప్పున అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచే పంపిణీ మొదలైంది. అయితే పార్టీ శ్రేణులను సమీకరించడంలో నాయకులు ఆపసోపాలు పడుతున్నారు. ఏలూరు నగర శివారు పాలగూడెంలో సిద్ధం సభకు నియోజకవర్గాల నాయకులు తలమునకలయ్యారు. పాలగూడెం పంచాయతీ పరిధిలోని 110 ఎకరాల స్థలంలో బహిరంగ సభకు ఏర్పాటు పూర్తయ్యాయి. ఒక్క ఏలూరు జిల్లా నుంచే 80 బస్సులు, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 115 ఆర్టీసీ బస్సులను పంపించారు. ఇక్కడి నాలుగు డిపోల్లో వున్న బస్సులు 296 కాగా, భీమవరం నుంచి 35 బస్సులు, తణుకు నుంచి 35, తాడేపల్లిగూడెం నుంచి 22, నరసాపురం నుంచి 25 బస్సులు వెరసి 115 పంపించారు. ఇక మిగిలిన బస్సులతో సర్వీసులు నడపాలి. దీంతో ఈ రోజు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. శనివారం ఉదయానికల్లా ఆయా బస్సులన్నీ సభకు బయలుదేరడానికి సిద్ధం కావాలని అధికారులు ఆదేశించారు. ఏయే ప్రాంతాల నుంచి ఎంత మందిని ఎలా సేకరించాలన్న పూర్తిస్థాయి వివరాలను నియోజకవర్గాల్లోని క్లస్టర్ల వారీ వైసీపీ నాయకులకు సంబంధిత ఎమ్మెల్యేలు అప్పగించారు. పూర్తిగా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సభకు జన సమీకరణ బాధ్యతలను కిందిస్థాయి కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, గృహ సారథులకు ఇచ్చారు.

ఇక ట్రాఫిక్ మళ్లింపులు, సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లతో అధికారులు పార్టీ కార్యకర్తలతో పోటీ పడుతూ పనులు చేస్తుండడం విశేషం. పంట కాల్వలు పూడ్చి వేస్తూ, డివైడర్ పగలకొట్టించడం వంటి పనుల్లో అధికారులు తల మునకలయ్యేలా పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని 79 ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు 112 ఎయిడెడ్ పాఠశాలల నుంచి 600కు పైగా బస్సులను వైసీపీ నాయకులు తీసుకున్నారు. ఆయా బస్సులను శుక్రవారం రాత్రి నుంచే తమ ఆధీనంలో పెట్టుకుని, శనివారం ఉదయానికి నిర్దేశిత ప్రాంతాలకు తరలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయించారు. బస్సులు లేని కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల నుంచి సమస్యలు తలెత్తకుండా వైసీపీ నాయకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కళాశాల యాజమాన్యాలతో మాట్లాడి శనివారం ఒక్క రోజున దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు క్లాసులు రావాల్సిన పనిలేదని, అవసరమైతే ఆదివారం ప్రత్యేకంగా క్లాసుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని విద్యార్థులకు చెప్పించారు.

3,298 మంది పోలీసులతో బందోబస్తు

ఏలూరు క్రైం : సభా ప్రాంగణం వద్ద ఇప్పటికే భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సభ వద్దకు చేరుకున్న అధికారులు ఏయే బృందాలు ఎక్కడెక్కడ పనిచేయాలన్న వివరాలపై పూర్తిస్థాయి వివరాలు అందించారు. ఎవరెవరిని సభ లోపలకు అనుమతించాలి, ఏయే దశల్లో భద్రత చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అధికారులు శిక్షణనిచ్చారు. ఈ క్రమంలో శనివారం జరగబోయే సభను పూర్తిగా అధికారులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. సభకు 3,298 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. బందోబస్తుకు వచ్చిన పోలీసులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడారు. 'సభకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. సభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఎక్కడికక్కడ నియంత్రణ చేయాలి. వాహనాల్లో వచ్చే ప్రజలను సక్రమమైన మార్గంలో సభాస్థలికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి. వీవీఐపీ భద్రత కోసం పోలీసు అధికారులు అలసత్వం వహించకుండా ఉద్యోగ నిర్వహణ చేయాలి. సభ అనంతరం ప్రజలు గమ్యస్థానాలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. బందోబస్తులో ఏడుగురు ఏఎస్పీలు, 23 మంది సీఐలు, 78 మంది ఎస్ఐలు, 197 మంది ఆర్ఎస్ఐలు, 478 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 1,119 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 199 మంది మహిళా కానిస్టేబుళ్లు, 80 మంది హోం గార్డులు, 60 మంది మహిళా హోం గార్డులు, 147 మంది ఏఆర్ సిబ్బంది, 164 మంది స్పెషల్ పార్టీ పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నా'మని ఎస్పీ తెలిపారు.



సిద్ధం సభతో.. నేటి ఇంటర్ పరీక్ష 23కి వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 : సీఎం సిద్ధం సభతో శనివారం జరగాల్సిన ఇంటర్ పరీక్ష వాయిదా పడింది. ఇంటర్మీడియట్ తొలిదశ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులందరికీ నిర్వహించే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సులో అర్హత సాధించినట్టు తుది పాస్ సర్టిఫికెట్ ఇస్తారు. జిల్లాలోని 124 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో శుక్రవారం జరిగిన నైతికత, మానవ విలువలు పరీక్షకు జనరల్ విభాగంలో 13,517 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,290 మంది, ఒకేషనల్ విభాగంలో 2,147 మందికి 2,031 మంది హాజరయ్యారని డీవీఈవో, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. శనివారం జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్షను సీఎం 'సిద్ధం' సభకు వివిధ జిల్లాల నుంచి జనసమీకరణ నిమిత్తం ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల బస్సులను రవాణా శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ దృష్ట్యా పరీక్షను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేశారు. సీఎం సభ నిమిత్తం ఏలూరు జిల్లాలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 600లకు పైగా బస్సులను రవాణా శాఖ సమకూర్చడం ద్వారా స్వామి భక్తిని చాటుకుంది. ఆ మేరకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష వాయిదా పడడంతో ఇంటర్ విద్యార్థులపై ప్రభావం పడింది. ఒక సభ కోసం వేలాది మంది విద్యార్థుల జీవితాలను పణంగా పెడతారా ? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ఏం చెప్పారు.. ఏం చేశారు?

జగనన్నా.. ఈ బాసలు గుర్తున్నాయా?

- మేమొస్తే పోలవరం పూర్తి చేస్తామన్నారు
- కొల్లేరుకేమో వైభోగమంటూ ఊదరగొట్టారు
- సాగు నీటికి ఎద్దడే రాదన్నారు
- నరసాపురంలో రేవులు రప్పిస్తామన్నారు
- ఎత్తిపోతల పథకాలకు తిరుగుండదన్నారు

అధికారంలోకి రావడానికి ఐదేళ్ల క్రితం గోదావరి జిల్లా వాసులకు ఇలా జగన్ ఎన్నో హామీలిచ్చారు. మరెన్నో బాసలు చేశారు. అధికార పగ్గాలు చేపడితే ఉమ్మడి పశ్చిమ రూపురేఖలే మార్చేస్తామన్నారు. మరి అధికారంలోకి వచ్చారు.. అన్న మాట నిలబెట్టుకున్నారా.. ? అని ప్రశ్నిస్తే ఏమీ లేదని సమాధానం వస్తోంది. మళ్లీ ఇప్పుడు ఎన్నికలకు సిద్ధం అంటున్నారు.. ఇప్పుడేం చెబుతారు... సమయం చాలలేదు.. పూర్తి చేయలేకపోయామంటారా..? ప్రతిపక్షాల కుట్ర, కుతంత్రాలే దీనికి కారణమంటారా?


(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



కొల్లేరును నమ్ముకుని బతుకుతున్న వేలాది కుటుంబాలకు వైసీపీ ఆసాంతం తోడుగా ఉంటుందని ఎన్నికల ముందు పదే పదే జగన్ వైసీపీ పక్షాన హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితిలోనూ కొల్లేరు జిరాయితీ భూములను అర్హులకు అందిస్తామని పదే పదే స్థానిక నేతలతోపాటు వైసీపీ అగ్ర నేతలు ఓట్ల సమయంలో గాలం వేశారు. తీరా కొల్లేరుకు పూర్వ వైభోగం ఏమోగానీ, పరీవాహక ప్రాంత గ్రామాల్లో ఈ ఐదేళ్లలోనూ జనం వలసబాట పట్టారు. వైసీపీలో పెత్తనం చెలాయిస్తున్న వారు ఏకంగా ఎకరాలకు ఎకరా లే చెరువులుగా తవ్వేశారు. అభయారణ్య చట్టాన్ని తూచ్ అన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు కల్పిస్తామన్న ఉపాధి అడ్రసు లేకుండా పోయింది. కొల్లేరును పర్యాటకంగా మార్చి ఉపాధితోపాటు రూపురేఖలు మార్చేస్తామని చెప్పి న మాటలు ముమ్మాటికీ నీటిమూటలయ్యాయి. కొల్లేరులో మిగులు భూముల పంపిణీ అడ్రసు లేకుండా పోయింది. ఆర్భాటంగా కొల్లేరుకు ఉప్పు నీరు చేరకుండా మూడుచోట్ల నిర్మిస్తామన్న రెగ్యులేటర్లు అంతూ పంతూ లేవు. బడ్జెట్‌లో మాత్రం శంకుస్థాపన సమయంలో మాత్రం సీఎం జగన్ నోట వరాలే వరాలు. ఆచరణకొచ్చే సరికి మచ్చుకైనా పనులు ఆరంభిస్తే ఒట్టు.

రేవులన్నారు... ఫిషింగ్ హార్బర్లన్నారు

గోదావరి జిల్లాను అభివృద్ధి చేస్తామని, సముద్ర తీరాన ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి, ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు తాము వెనుకడుగు వేసేది లేదని చెప్పుకుంటూ వచ్చిన సీఎం జగన్ ఇప్పటికీ మాట నిలబెట్టుకోలేకపోయారు. నరసాపురం సమీపాన బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారు గానీ, పనులు ఇప్పటికీ పుంజుకోలేదు. అంతకంటే మించి ఆ మేరకు యంత్రాంగం సీరియస్‌గా స్పందించలేకపోయింది. దీనికి తోడు ఆక్వా యూనివర్సిటీ వ్యవహారంలోనూ ఇదే తీరు.. అదే ఫెయిల్యూర్ బాట.





పోలవరం ఏమైంది సార్ ?


తెలుగుదేశం ప్రభుత్వ హయాం వరకు పోలవరం ప్రాజెక్టు పనులు 74 శాతం మేర పూర్తయ్యాయి. రికార్డుస్థాయిలో పనులు పరుగులు పెట్టాయి. స్పిల్ వే దగ్గర నుంచి డయాఫ్రమ్ వాల్ వరకు నిర్మాణాలన్నీ ఒక కొలిక్కి వచ్చేశాయి. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో వేల మంది కార్మికులు నిత్యం చెమటోడ్చేవారు. ఇదే విధంగా పనులను వెంటాడితే ప్రాజెక్టు పూర్తి చేయడం ఏమంత కష్టం కాదనుకున్నారు. ఇదంతా ఐదేళ్ల క్రితం మాట. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు పనుల్లో జరిగిన, పురోగతి ఎంత..? ఈ ఐదేళ్లలో కేంద్రం మెడలు వంచి రప్పించిన నిధులెన్ని..? పోలవరం వాస్తవ డిజైన్ ప్రకారం ఈ ప్రాజెక్టు పరిధిలో ఎన్ని ఎకరాలకు నీరివ్వాలి..? దీనిని కాలదన్ని ఏకంగా ఎత్తును తగ్గించి చేతులు దులిపేసుకున్నారు కదా అని రైతులు విమర్శలు గుప్పిస్తున్నప్పుడు సంబంధిత అధికారులు నోరెత్తలేకపోయిన విష యాన్ని ఇపుడందరూ మరోసారి గుర్తుచేస్తున్నారు. ఈ ఐదేళ్లలో ప్రాజెక్టు సందర్శనకు అప్పుడప్పుడొకసారి వచ్చిన సీఎం జగన్ ఆ తర్వాతయినా తదుపరి లక్ష్యాలు అందుకోగలిగారా అనే ప్రశ్నలకు సమాధానం కరువైంది. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద కాలనీల నిర్మాణం అంతంత మాత్రంగా సాగాయి. గిరిజనులకు, గిరిజనేతరులకు ముంపు ప్రాంతంలో ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారంగా అందిస్తామని, మాట నిలబెట్టుకుంటామని అప్పట్లో ప్రతిపక్ష నేతగా మీరిచ్చిన హామీ గుర్తుందా ? జారీ చేసిన జీవో మేరకు తూతూమంత్రంగా నిలవలేదా? పరిహారం కాస్తా పరిహాసంగా మారలేదా అంటూ ముంపు గ్రామాల్లో బాధితులంతా ఇప్పటికీ విలవిల్లాడుతున్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం బావురుమంటోంది. తెలుగుదేశం హయాంలో 2019 ముందు వరకు 2 వేల 300 కోట్లు ఖర్చు పెడితే ఈ ఐదేళ్లలో పనుల్లో సినిమా చూపించారు. ఎర్ర కాల్వ ఆధునికీకరణకు నిధుల కోసం పరీవాహక రైతులు చూసి విసిగిపోయారు. తాడిపూడి ఎత్తిపోతల ఎప్పుడో చతికిలపడింది. పట్టిసీమ కరెంట్ బకాయిలతో కునారిల్లుతోంది. డెల్టా ఆధునికీకరణను ఎప్పుడో అటకెక్కించింది.

వైసీపీ బీసీ మంత్రం..

నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ఉమాబాల ఖరారు

- పోటీ చేసే అభ్యర్థి కోసం అధిష్ఠానం ముప్పుతిప్పలు
- తెర పైకి పలువురి పేర్లు
- ఎట్టకేలకు మహిళా అభ్యర్థి ఎంపిక
- బీసీ నినాదంలో అనూహ్య పరిణామం



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన గూడూరి ఉమాబాలను ఎట్టకేలకు అధికారికంగా ప్రకటించారు. నరసాపురం నుంచి పోటీకి దింపేందుకు అభ్యర్థుల కోసం వైసీపీ ముప్పుతిప్పలు పడింది. ఉభయ గోదావరి జిల్లాల్లో తగినంత అర్హత అంటే ఆర్థిక స్థోమత కలిగిన వారి కోసం అన్వేషించింది. ఈ అన్వేషణలో శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్యను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దించేందుకు ప్రయత్నించారు. అయితే తమ్మయ్య ప్రతిపాదన పట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలు కొంత అసంతృప్తి, నిరాసక్తత ప్రదర్శించడంతో వైసీపీ అధినాయకత్వం దిగిరాక తప్ప లేదు. తమ్మయ్య స్థానంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను రంగంలోకి దించేందుకు పావులు కదిపారు. ఇక్కడ కూడా చుక్కెదురైంది. తన కుమారుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నందున ఆయన తరపున అన్నీ తానే చూసుకోవాలని పిల్లి సుభాష్ నాయకత్వ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. దీంతో చాన్నాళ్ల నుంచి పార్టీలో కొనసాగుతున్న, బలహీన వర్గాలకు చెందిన విద్యావంతురాలు గూడూరి ఉమా బాలను ఒప్పించి ఆ మేరకు నరసాపురం ఎంపీ స్థానానికి అభ్యర్థిగా శుక్రవారం రాత్రి ప్రకటించారు.

అంచలంచెలుగా...

భీమవరం కేంద్రంగా గడచిన రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కీలకంగా ఉమాబాల వ్యవహరిస్తున్నారు. ఆది నుంచి రాజకీయ కుటుంబంలో ఉన్న ఆమె కాంగ్రెస్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించారు. ఒకానొక దశలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచారు. కాంగ్రెస్ నుంచి ప్రజారాజ్యంలోకి, ఆ తర్వాత వైసీపీలోనూ పార్టీ బాధ్యతలను కొన్నాళ్ల పాటు నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా కొనసాగారు. బీసీ వర్గానికి చెందిన తనకు తగిన ప్రాధాన్యతివ్వాలని ఆది నుంచి ఉమాబాల డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇప్పుడు అభ్యర్థుల కొరత నెదుర్కొంటున్న వైసీపీ అనూహ్యంగా బీసీ వర్గానికి చెందిన మహిళ ఉమాబాలను నరసాపురం లోక్‌సభ స్థానానికి ఎంపిక చేసింది. బీసీ మహిళగా ఆమెకు తగిన గౌరవం ఇచ్చామని సంకేతాలు పంపేందుకు వైసీపీ వ్యూహం పన్నింది.

నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు..

రూ.300 కోట్లు



- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు
- రాష్ట్రం వాటా ఇస్తేనే పనులు పూర్తి

నరసాపురం, ఫిబ్రవరి 2 : కేంద్రం గురువారం ప్రవేశ పెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు పెద్ద ఊరట లభించింది. కొంత కాలంగా నిధుల్లేక నిలిచిన ఈ రైల్వే లైన్ పనులకు రూ.300 కోట్లు కేటాయించారు. దీంతో పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. కోటిపల్లి - నరసాపురం రైల్వే ప్రతిపాదన బ్రిటీష్ హయాం నుంచి ఉంది. 2000 నుంచి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా ప్రతి బడ్జెట్‌లోనూ సర్వేకు మాత్రమే నిధులిస్తూ రైల్వేశాఖ చేతులు దులుపుకుంటూ వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడితో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. సుమారు 57 కిలోమీటర్ల మేర చేపట్టే కొత్త రైల్వే లైన్ నిర్మాణ పనులకు రూ.2,120 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతాన్ని వ్యయాన్ని భరించాలి. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1150 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి నిధులు విడుదల చేయాలని విన్నవించినా స్పందన లేదు. ఇప్పటి వరకు కేంద్రం ప్రతి బడ్జెట్ లోనూ ఈ ప్రాజెక్టుకు నిధులిస్తూ వచ్చింది. తొలుత రూ.450 కోట్లు ఇచ్చిన కేంద్రం, గత ఏడాది రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి. ఈ కొత్త ప్రాజెక్టులో గోదావరిపై మూడు చోట్ల వంతెనలు నిర్మిస్తున్నారు. కోటిపల్లి వంతెన పనులు పూర్తయ్యాయి. పాశర్లపూడి, చించినాడ వద్ద వంతెన పనులు 60 శాతం పూర్తవ్వగా భూసేకరణ 80 శాతం పూర్తయింది. వంతెన నిర్మాణలు పూర్తయితే కొత్త ట్రాక్ పనులే మిగులుతాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రాజెక్టు 2021 నాటికే పూర్తికావాలి. నిధుల కొరత, కోవిడ్ కారణంగా ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఓటాన్ బడ్జెట్‌లో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పెద్దపీట వేయడంతో గౌతమి, వైనతేయి, వశిష్ఠా నదులపై పెండింగ్ వంతెనల పనులు వేగవంతం కానున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు త్వరగా విడుదల చేసి పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్వో పుష్పమణి

డీఆర్వోగా పుష్పమణి బాధ్యతల స్వీకారం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : జిల్లా రెవెన్యూ అధికారిగా డి.పుష్పమణి శుక్రవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇప్పటి వరకు పనిచేసిన డీఆర్వో వెంకటేశ్వరరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో పుష్పమణి డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2 : జిల్లా అదనపు ఎస్పీగా జి.స్వరూపరాణి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు నుంచి ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఆమెను అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. అనంతరం ఏఎస్పీ స్వరూపరాణి ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.



ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 2: విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుది ఓటరు జాబితా పబ్లికేషన్ రోజు నాటికి పెండింగ్‌లో ఉన్న ఓటరు జాబితా ఫారాలు, ఎస్ఎస్ఆర్-2024 సమయంలో స్వీకరించిన ఫారాలు, అనోమలిస్ పెండింగ్, తుది ఓటరు జాబితాపై ఓట్లు చేర్పులు, తొలగింపులు, సవరణలు, 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల భద్రత, వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ స్టేషన్లు, కౌంటింగ్ సెంటర్లు, అసెంబ్లీ మ్యాపింగ్, ఎన్నికల సిబ్బంది, ఆర్వోలు, ఆర్వోల వేకెన్సీస్, పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు తదితర అంశాలపై ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి తదితరులు పాల్గొని జిల్లాకు సంబంధించిన వివరాలు అందించారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 2 : ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన 32 మంది తహసీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు.

పేరు	ఎక్కడి నుంచి..	ప్రస్తుతం
వీఎస్‌వీవీకే ముఖర్జీ	కాకినాడ రూరల్	ఏలూరు అర్బన్
వి.జితేంద్ర	పెద్దాపురం	దెందులూరు
సీహెచ్ నరసింహరావు	గన్నవరం	ఏలూరు రూరల్
జి.చిన్నారావు,	ఏలేశ్వరం	వేలేరుపాడు
వి.భావన్నారాయణ	నందివాడ	పెదపాడు
కె.వెంకటశివయ్య	పెనమలూరు	ఉంగుటూరు
జి.వరహాలయ్య	కాకినాడ	భీమడోలు
కె.పోసిబాబు	బిక్కవోలు	నిడమర్రు
జీవీఎస్ ప్రసాద్	యు.కొత్తపల్లి	పోలవరం
చాట్ల వెంకటేశ్వర్లు	ఎ.కొండూరు	బుట్టాయిగూడెం
ఆర్‌వీ వెంకటేశ్వరరావు	గొల్లప్రోలు	జీలుగుమిల్లి
కె.రాజ్యలక్ష్మి	గోకవరం	కొయ్యలగూడెం
డి.అచ్యుతకుమారి	--------	కుక్కునూరు
టి.సుభాష్	పెదపూడి	టి.నరసాపురం
పీవీవీ గోపాలకృష్ణ	ప్రత్తిపాడు	చింతలపూడి
పి.త్రినాథరావు	పిఠాపురం	కామవరపుకోట
పీఎన్‌వీ ప్రసాద్,	కంకిపాడు	లింగపాలెం
కె.స్లీవజోజి	జంగారెడ్డిగూడెం	జంగారెడ్డిగూడెం
జి.రవికాంత్	కృష్ణా కలెక్టరేట్	ద్వారకా తిరుమల
కె.కాశీవిశ్వేశ్వరరావు	కోనసీమ కలెక్టరేట్,	ఏలూరు కలెక్టరేట్ ఏవో
కె.చంద్రశేఖర్‌రెడ్డి	పెద్దాపురం	సూపరింటెండెంట్, ఏలూరు
డి.ఏసుబాబు	కొత్తపేట	ఏలూరు
ఎం.ఇందిరాగాంధీ	భీమడోలు	కేఆర్‌ఆర్‌సీ, ఏలూరు
ఎం.సూర్యప్రభ	కాకినాడ కలెక్టరేట్	ఏలూరు కలెక్టరేట్
జె.శ్రీనివాస్	ఏలూరు రూరల్	డీఏవో, ఏలూరు
ఎస్.పోతురాజు	తాళ్లరేవు	కైకలూరు
డీవీవీ సుబ్రహ్మణ్యేశ్వర్	కలిదిండి	కలిదిండి
ఎస్‌ఎల్‌ఎన్.కుమారి	సామర్లకోట	ముదినేపల్లి
ఎండీ మక్సూద్ అలీ	తూ.గో కలెక్టరేట్	నూజివీడు
బి.మృత్యుంజయరావు	రావులపాలెం	ఆగిరిపల్లి
ఏవీ శాస్త్రి	కాకినాడ	డీఏవో, నూజివీడు
టి.తేజోమణి	డీఏవో, ఏలూరు	కేఆర్‌ఆర్‌సీ, నూజివీడు

జాతీయస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక



బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ కిస్ యూనివర్సిటీలో ఈనెల 4నుంచి 11వ తేదీ వరకు 73వ జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఈ మేరకు ఏలూరుకు చెందిన ఐదుగురు క్రీడాకారిణులను ఎంపిక చేశామని బాస్కెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గవ్వా శ్రీనివాసరావు తెలిపారు. ఎ.టాలీ అనిత, జి.నాగదేవి, టి.జ్యోతి, నాగవినయ్‌శ్రీ, పాలకొల్లుకు చెందిన ఆర్.మహతిని ఎంపిక చేశామన్నారు. గత ఏడాది జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు క్రీడాప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కోశాధికారి కె.మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ, సెలీన్‌రోజ్ తదితరులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 'కోపల్లె జట్టు'



కోపల్లె జట్టును అభినందిస్తున్న పీవీఎల్ తదితరులు

కాళ్ళ, ఫిబ్రవరి 2 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కోపల్లె గ్రామ జట్టు ఎంపిక కావడంతో జట్టు సభ్యులను డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అభినందించారు. శుక్రవారం పెదఅమిరంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారన్నారు. కోపల్లె కబడ్డీ జట్టు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిందని, రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించాలని జట్టుకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు రూ.20వేలు ఆర్థిక సహకారంతో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ జట్లకు జెర్సీలను పీవీఎల్ చేతుల మీదుగా అందజేశారు. కాళ్ళ, ఆకివీడు, జడ్పీటీసీలు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, కె.రాజేష్, గుండు నాగేశ్వరరావు, పెన్మెత్స రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు కాలంతో పోటీపడాలి'



వేడుకలలో ఆచార్యులు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 2 : విద్యార్థులు కాలంతోపా టు పోటీపడాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ.వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్‌పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు రోజులు నిర్వమించే ఉల్కాస్‌జీ టెక్నో కల్చరల్(సాంకేతిక, సాంస్కృతిక) ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభా పాటవాలను, నూతన ఆలోచనలను వెలికితీసేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి జీవీ రామారావు ఆధ్వర్యంలో అగ్ని మాపక సిబ్బంది చేసిన విన్యాసాలు, సాంస్కృతిక, సాంకేతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆచార్యులు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జాతీయ కూచిపూడి జానపద నృత్యపోటీలు



మాట్లాడుతున్న భూపతిరాజు విశ్వనాథరాజు తదితరులు

పాలకొల్లు టౌన్, జనవరి 2 : క్షత్రియ సంక్షేమ పరిషత్, గౌరీశంకర్ సంగీత నృత్య కళా అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 4న జాతీయ కూచిపూడి జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డాక్టర్ కేఎస్‌పీఎన్.వర్మ తెలిపారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ పాలకొల్లు క్షత్రియ కల్యాణ మండపంలో పోటీలు జరుగుతాయన్నారు. కూచిపూడి నృత్య విభాగం సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, క్లాసికల్ గ్రూప్ నాలుగు విభాగాలుగానూ, జానపద నృత్య విభాగంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, జానపద గ్రూప్ విభాగాలు మొత్తం ఎనిమిదింటికి పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. దేశ నలుమూలలు నుంచి సుమారు రెండువేల మంది కళాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. భోజనం, వసతి సౌకర్యాలు కలిస్తాన్నారు. సమావేశంలో అకాడమి అధ్యఓఉడు అయినాల సూర్యనారాయణ, ముత్యాల రామారావు, గొట్టుముక్కల భాస్కరవర్మ, ముత్యాల శ్రీనివాసరావు, విన్నకోట వెంకటరమణ, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, కాలేజీలో ప్రవేశానికి ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 2: ఆరుగొలను బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగ తిలో 80 సీట్లు, ఇంటర్ బైపీసీలో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశానికి 2023-24లో నాలుగో తరగతి, పదో తరగతి చదివుతున్నవారు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తుచేసుకున్న వారికి జిల్లాలో ఎంపిక చేసిన పరీక్షాకేంద్రాల్లో మార్చి 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 89777 69988కు ఆఫీస్ పనిచేసే సమయంలో సంప్రదించాలని కోరారు.

ఆచంట, పెనుగొండలో..

పెనుగొండ, ఫిబ్రవరి 2 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలికలు) ఆచంట, పెనుగొండలో 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ తెలిపారు. అర్హులైన వారు ఈనెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 95504 02822, 90144 18727లకు సంప్రదించాలన్నారు.

దుకాణాలన్నీ కార్మికశాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 2: జిల్లాలోని ప్రతి సంస్థ దుకాణాలు కార్మిక శాఖలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏలూరు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలోని కార్మిక శాఖ కార్యాలయంలో శుక్రవారం పలు వర్తక సంఘాల యజమా నులతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల సంస్థల చట్టం-1988 ప్రకారం కార్మికశాఖలో ఈనెల 29లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో కార్మికశాఖ చట్టం ప్రకారం దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల రిజిస్ట్రేషన్‌ను దగ్గరలోని మీసేవా, గ్రామసచివాలయాల్లో నమోదుచేయించుకుని సర్టిఫికెట్‌ను పొందవచ్చన్నారు. జిల్లాలో సుమారు 60వేల దుకాణాల సంస్థలు ఉన్నాయని, ఇంకా సుమారు 20 వేల దుకాణాలు కార్మికశాఖలో నమోదు కావాల్సి ఉందన్నారు. భీమవరం సహాయక కార్మిక శాఖ అధికారులు శివ నాగమల్లేశ్వరరావు, ఎస్. దుర్గారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పలు దుకాణాల యజమానులు కాగిత రమణ, సెక్రటరీ కేవీ సాయిరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి దిగుబడి పతనం

ధర ఘనం.. దిగుబడి అధమం

ఉభయ గోదావరి జిల్లాలో సహజంగా కొబ్బరి కాయల దిగుబడి అధికంగా ఉంటుంది. రానురాను కొబ్బరి చెట్లు విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు, 60 నుంచి 70 సంవత్సరాల నాటి చెట్లు అధికంగా ఉండడంతో దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత తగ్గి, ధర తగ్గిపోతుంది. ఫలితంగా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. భూముల ధరలు పెరగడం, ఆక్వా చెరువుల తవ్వకాలు పెరగడంతో ప్రతి ఏడాది కొబ్బరి చెట్ల విస్తీర్ణం తగ్గిపోవడంతో ఉత్పత్తి తగ్గిపోతుంది. కొత్తగా కొబ్బరి మొక్కలు నాటేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కొబ్బరి ధర మెరుగ్గా ఉన్నప్పటికీ దిగుబడి ఘననీయంగా తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పాలకొల్లు

- ఘననీయంగా తగ్గిన కొబ్బరి కాపు
- ఉభయ గోదావరి జిల్లాలో కొబ్బరి రైతుకు గడ్డుకాలం



ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మునుపెన్నడూ లేనివిధంగా కొబ్బరి దిగుబడులు నాలుగింట మూడింతలు తగ్గిపోయింది. నెలకి వెయ్యి కాయలు దించే కొబ్బరి రైతుకి ఇప్పుడు 200 నుంచి 300 దిగుబడి రావడం కష్టంగా మారింది. కొబ్బరి రైతుల్లో సాగుపై ఆసక్తి తగ్గడం మరోవైపు కొత్తగా కొబ్బరి తోటలు సాగుకి రైతులు ముందుకు రాకపోవడంతో తూర్పుపశ్చిమ పాత జిల్లాల్లో కొబ్బరి తోటలలో 60శాతం పైబడి చెట్లు వయస్సు మీరి కొబ్బరి కాయ సైజు తగ్గిపోతుంది. మరోవైపు నల్లి తెగులు ఇతరత్రాకారణాలతో కొబ్బరికాయ నాణ్యత తగ్గుతుంది. అయినప్పటికీ ధర దడ పుట్టిస్తుంది. పాత తూర్పుగోదావరి జిల్లాలో రైతువారీ కొబ్బరి కాయ రూ.10నుంచి 11కు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో కాయ రూ.9నుంచి 10లకు రైతుకు దక్కుతుంది. ఆయా జిల్లాల్లో ప్రాంతాలు, కాయ నాణ్యతను బట్టి ధర కొంచెం అటూఇటుగా ఉంది. దిగుమతి ధరలు సరాసరి నాణ్యత గల వెయ్యి కాయలు రూ.11వేలు ఉండగా ఢిల్లీ క్వాలిటీ రూ.13వేలు, బత్తీల ధర రూ.8వేలు, నంబరు కాయ రూ.8500 ఉండగా కురిడి రూ.11వేలు కురిడి గండేరా రూ.13వేలు ఉంది.

మార్కెట్‌లో ధరలు..

బహిరంగ మార్కెట్‌లో పీచు తీసిన కొబ్బరికాయ 26 సెంటీమీటర్లు చుట్టుకొలత వున్న కాయ రూ.20, 28 సెంటీమీటర్ల కాయ ధర రూ.22, 30 సెంటీమీటర్ల కాయ ధర రూ.25 ఉంది. కొబ్బరి కాయలు పీచు తీసిన తర్వాత టెంకాయ సైజు తగ్గడంతో కొబ్బరి వర్తకలు నష్టపోతున్నామని చెబుతున్నారు.

కానరాని ఉద్యానవర్సిటీ సూచనలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఉద్యాన యూనివర్సిటీ ఏర్పాటు చేసినప్పటికీ కొబ్బరి రైతులకు క్షేత్రస్థాయిలో సూచనలు కరువయ్యాయి. సమీప రాష్ట్రం కేరళలో కొబ్బరి రైతులకు అక్కడి ప్రభుత్వం దన్నుగా నిలుస్తుంది. నవ్యాంధ్రలో కొబ్బరి రైతును పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు కొబ్బరి ఉపఉత్పత్తులకు ఇక్కడ ప్రాధాన్యత లేదు. ప్రతిఏటా కొబ్బరి తోట విస్తీరణం తగ్గుతూ వస్తుంది. ఉమ్మడి జిల్లాలో పంటభూముల ధరలు ఘననీయంగా పెరగడం, కొబ్బరి సాగుకి అధిక వ్యయం కావడం ఆదాయం తక్కువ రావడంతో రైతులు కొబ్బరి సాగుపై ఆసక్తి చూపించడం లేదు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో 50 నుంచి 60 ఏళ్ల పైబడిన కొబ్బరి చెట్లే అధికంగా ఉన్నాయి. మరోవైపు రెండు జిల్లాల్లోనూ హరితవనం స్థానంలో నీలి విప్లవం (చేప, రొయ్యల చెర్వులు) పెరగడంతో కొబ్బరిసాగు తగుతుంది.

పక్క రాష్ట్రాల పోటీతో తగ్గిన డిమాండ్



రెండు దశాబ్దాల ముందు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కొబ్బరికి దేశవ్యాప్తంగా డిమాండ్ ఉండేది. ఇప్పుడు సమీప రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటకలలో కొబ్బరి సాగు పెరగడంతో తూర్పు పశ్చిమ జిల్లాల కొబ్బరికి కొంత డిమాండ్ తగ్గింది. ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరికాయ సైజ్‌ను బట్టి రూ.20 నుంచి 30 అమ్ముతున్నారు. దిగుబడి తగ్గడంతో ప్రత్యక్షంగా రైతులు పరోక్షంగా కొబ్బరి వర్తకులు నష్టపోతున్నారు.

- కరారి నాగేంద్ర, కొబ్బరి వ్యాపారి

రైతుల్లో చైతన్యం రావాలి



కొబ్బరి రైతుల్లో చైతన్యం రావాలి. పాత కొబ్బరిచెట్లను తొలగించి కొత్త సాగు ప్రారంభించాలి. ఆదాయం వస్తుండగానే పాత తోటల్లో కొత్త కొబ్బరి మొక్కలు నాటి అవి కాపునకు వచ్చిన వెంటనే పాతవి తొలగించాలి. 60 నుంచి 70 ఏళ్ల వయస్సు ఉన్న కొబ్బరి చెట్లలో కాయ నాణ్యత తగ్గుతుంది. సస్యరక్షణ చేపట్టి కొబ్బరి సాగు చేస్తే ఎకరం తోటలో నెలకి రెండు నుంచి మూడు వేలు వరకూ కాయ దింపుకొనే అవకాశం ఉంటుంది.

- మైగాపుల రాంబాబు, మాజీ అధ్యక్షుడు పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్

న్యాయవాదుల బంద్ విజయవంతం





ఆందోళనలో పాల్గొన్న పొత్తూరి, కొవ్వలి
మూతపడిన దుకాణాలు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 2: వైసీపీ ప్రభుత్వం ఇటీవల కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన భూహక్కుల చట్టాన్ని నిరసిస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన పట్టణ బంద్ విజయవంతమైంది. దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, బ్యాంకులు తెరుచుకోలేదు. బులియన్ మార్కెట్ వెలవెలబోయింది. సాయంత్రం వరకు ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. బంద్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐలు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఉదయం నుంచి న్యాయవాదులు అన్ని కూడళ్లల్లో తిరిగి దుకాణాలు, హోటళ్లను మూయించివేశారు. కొద్దిసేపు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపి పాతబజార్ వరకు ప్రదర్శన చేశారు. తక్షణమే జీవో 27న రద్దు చేయాలని నినాదాలు చేశారు. రెండు నెలలుగా పలు రూపాల్లో నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బంద్‌కు దిగామన్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు..

ఈ కొత్త చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, కోటిపల్లి వెంకటేశ్వరావు, నెక్కంటి సుబ్బారావు, కవురు పెద్దిరాజు తెలిపారు. ఈ జీవోను రద్దు చేయకపోతే న్యాయవాదులతో కలసి ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. చల్లా దానయ్యనాయుడు, ఆర్‌కే కుమార్, పి.సూరిబాబు, శ్రీధర్, చాముండేశ్వరి, కె.రమేష్, పూరెళ్ల శ్రీనివాస్, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రైతులకు కష్టాలు

- పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రైతు పోరుబాట



రైతు పోరుబాట యాత్రలో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర, జనసేన నేతలు

పాలకొల్లు రూరల్/పోడూరు, ఫిబ్రవరి 2: జగన్ పాలనలో వ్యవ సాయ శాఖ అడ్రస్ గల్లంతయ్యిందని ఎమ్మెల్యే రామానాయుడు ఆరోపించారు. జగన్ ఐదేళ్ల పాలన రైతు వ్యతిరేక పాలనగా నిరసిస్తూ రైతుపక్షాన రైతు పోరుబాట యాత్రను ఎమ్మెల్యే రామానాయుడు ఆధ్వర్యంలో పాలకొల్లు లో టీడీపీ, జనసేన, రైతులు చేపట్టారు. నియోజకవర్గంలో మూడు రోజుల పాటు 25 గ్రామాల్లో సాగే పోరుబాట యాత్ర పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో ప్రారంభమై బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, కాపవరం, వడ్లవానిపాలెం, జిన్నూరు మీదుగా రాత్రి మట్టపర్రు వరకు సాగింది. అక్కడే ఎమ్మెల్యే రామానాయుడు బస చేశారు. పాదయాత్రలో ఎమ్మెల్యే రామానా యుడుతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన నేతలు శిద్ధిరెడ్డి అప్పారావు, బోనం చినబాబు టీడీపీ జనసేన శ్రేణులతో పాటు రైతులు, మహిళలు భారీసంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు పొడవునా రైతులతో మమేకమై రైతు కష్టాలు, సమస్యలను ఆలకించారు. అక్కడక్కడా వ్యవసాయ పనులు సాగుతున్న చేల్లోకి దిగి కూలీలతో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ అన్నదాత కష్టపడి పండించుకున్న ధాన్యం పంటను కొనుగోలు పేరుతో జగన్ ప్రభుత్వం దోపిడీ చేసిన డబ్బును రైతులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు పాతూరి రామప్రసాద్ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

కరగపాడు ఫారెస్ట్‌లో పెద్దపులి

గోపాలపురం, ఫిబ్రవరి 2: పెద్దపులి సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. రెండురోజులుగా గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామ శివారులోని గాడిచెరువులో ప్రవేశించిన పులి గురువారం సాయంత్రానికి జాతీయరహదారిని అనుకుని ఉన్న మాతంగమ్మ మెట్ట వద్దకు చేరుకుంది. అనంతరం అర్ధరాత్రి హైవేదాటి దాటి ఉదయానికి సుమారు ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించి కరగపాడు శివారులో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌కు చేరుకున్నట్టు తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారి ఎల్.ధనరాజు తెలిపారు. ఐదు కిలోమీటర్లు ప్రయాణించి అలసట చెందిన పులి ప్రస్తుతం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో విశ్రాంతి తీసుకుంటున్నట్టు తెలిపారు. దీనిజాడలు పసిగట్టేందుకు ప్రస్తుతం టైగర్‌టీమ్ పులిని వెంబడిస్తోందని, ఇక్కడ నుంచి పులి పాపికొండల వైపు ప్రయాణించే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

తాడిపూడిలో కనిపించింది పులా !

తాళ్లపూడి, ఫిబ్రవరి 2: తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలోని గోదావరి తీరంలో పెద్దపులి కనబడిందన్న విషయం సంచలనమైంది. శుక్రవారం మరోసారి అదే ప్రాంతంలోని మొక్కజొన్న తోట వద్ద సంచరించడం ఇసుక రీచ్‌లో పనిచేసే సిబ్బంది కంట పడింది. అయితే అది పులి కాదని అడవి పిల్లి అని కొందరు చెబుతున్నారు. అది ఏ జంతువో తేల్చి చెప్పాల్సిన ఫారెస్టు అధికారులు మాత్రం దీనిపట్ల స్పందించడం లేదు. రీచ్ వద్ద నైట్ షిఫ్ట్‌లో పనిచేసే సిబ్బంది మాత్రం పులి భయంతో డ్యూటీలు చేయలేమని సంస్థ అధికారులకు చెప్పినట్టు సమాచారం. పులి సంచారంపై తాము భయపడుతుంటే అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరుచోట్ల ఐదుగురి మృతి

వివాహిత ఆత్మహత్య



రాజేశ్వరి (ఫైల్)

భీమవరం క్రైం, ఫిబ్రవరి 2 : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమవరం మండలం రాయలంలో గురువారం రాత్రి జరిగింది. భీమవరం టూటౌన్ ఎస్‌ఐ జీజే ప్రసాద్ తెలిపిన వివరాలివి.. భీమవరం గునుపూడి ముగ్గుళ్ళ పేటకు చెందిన చిటికనేటి వెంకటరమణ కుమార్తె దోనె రాజేశ్వరి(32) కొంతకాలం క్రితం వివాహమైంది.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి రాయలంలో ఒంటరిగా ఉంటుంది. పిల్లలు తండ్రి దగ్గర ఉంటున్నారు. ఈక్రమంలో గురువారం రాత్రి ఇంటిలో నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు తలుపులు పగుల కొట్టి చూడగా ఆమె మృతి చెందింది. వివరాలు సేకరించి మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

పాలకొల్లు రూరల్, జనవరి 2 : లంకలకోడేరు హైస్కూల్ మలుపు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసాపురం మండలం లక్ష్మణేశ్వరానికి చెందిన మోటార్ సైక్లిస్ట్ గంధం పుల్లేశ్వరరావు(32) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున మంచు కప్పి ఉండడంతో బైక్ అదుపు తప్పి బండ రాయిని ఢీకొని పక్కనే ఉన్న బోదెలో పడిపోయాడని తెలిపారు. మృతుడుకి వివాహం కాలేదని, పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలోని ఓ ప్రైవేటు రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. కంపెనీ పనిమీద ఆకివీడు వెళ్తుండగా ఈప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు రూరల్ హెడ్ కానిస్టేబుల్ తిమ్మరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ.. వృద్ధుడి మృతి

పోడూరు, జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కవిటంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ ఎం.రామ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పోడూరుకు చెందిన పోడూరి వీరాస్వామి(70) వృత్తిరీత్యా బట్టలు ఇస్త్రీ చేస్తుంటాడు. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై మార్టేరు నుంచి ఇంటికి బట్టలు తీసుకొస్తుండగా కవిటం వంతెనం వద్దకు వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మార్టేరు వైపు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. వీరాస్వామికి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య నాగమణి, వివాహమైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

పెదపాడు, ఫిబ్రవరి 2 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పెదవేగి సీఐ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కలపర్రు వద్ద హైవే పై టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ శుభశేఖర్ తెలిపారు. ముద్దాయి యర్నాకులానికి చెందిన కె.ఇబ్రహీం పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో కొనుగోలు చేసి బస్సులో కేరళ రాష్ట్రానికి తీసుకెళుతుండగా తనిఖీ చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రూ.10వేలు విలువ గల గంజాయితో పాటు రూ.1500 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉండి, ఫిబ్రవరి 2: తన భార్యతో వేరే మహిళ గొడవపడడంతో అది భరించలేక పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని విజయవాడలో చికిత్స పొదుతూ ఓ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చెరుకువాడలో జరిగింది. ఉండి ఏఎస్‌ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన లక్కి గోపి(30) తాపీ పనిచేస్తుంటాడు. అతడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. భార్య సువార్త ప్రస్తుతం గర్భిణిగా వుంది. గోపికి గ్రామంలోని మరో మహిళతో చనువు పెంచుకుని ఊరు వదిలి వెళ్లిపోయారు. పెద్దలు వారిని మందలించి ఎవరింటికి వారిని పంపించారు. ఈక్రమంలో జనవరి 29న గోపి భార్య మరో మహిళతో గొడవపడడంతో అది తట్టుకోలేక పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. అతడిని వైద్యం నిమిత్తం ఏలూరు, అనంతరం మెరుగైన వైద్యానికి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బాధిత కుటుంబాలనికి అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

కుక్క కాటుకు బాలుడి మృతి



సాత్విక్ (ఫైల్)

లింగపాలెం, ఫిబ్రవరి 2: గణపవారిగూడెం గ్రామంలో వీధికుక్క కరవడంతో ఓ బాలుడు మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పిట్టా సాత్విక్(9)ను జనవరి 6వ తేదీన వీధికుక్క దాడిచేసి చెవి, చేతిపై కరిచిందని వెంటనే బాలుడి కుటుంబసభ్యులు స్థానికంగా వున్న కె.గోకవరం పీహెచ్‌సీకి తీసుకువెళ్ళగా ఆరోగ్యకేంద్రం మూసి ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లినట్టు బాలుడి తండ్రి పిట్టా పృథ్వీ తెలిపారు. మొదటి డోసు ఏలూరులో వేయించి మిగిలిన రెండు డోసులు కె.గోకవరంలోని ప్రభుత్వాసుపత్రిలో వేయించినట్టు తెలిపారు. కొన్నిరోజుల తరువాత తరచూ జ్వరం రావడంతో జనవరి 23న ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స చేసి, 26న మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి పంపించగా విజయవాడలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. బాలుడికి చేయించిన రేబిస్ ఇంజక్షన్ పనిచేయలేదని బాలుడి తల్లిదండ్రులు పృథ్వీ, రాజీశ్వరి ఆరోపిస్తున్నారు. బాలుడి మరణంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై కె.గోకవరం వైద్యాధికారి కృష్ణకిషోర్‌ను వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తిస్థాయి విచారణ విచారణ జరిపి నివేదికను పంపుతామన్నారు.

డీఎస్సీకి 164 ఉపాధ్యాయ ఖాళీలు ?

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2:డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి జిల్లానుంచి నోటిఫై చేసేందుకు సుమారు 164 పోస్టులను ప్రాథమికంగా పాఠశాల విద్యాశాఖ గుర్తించినట్టు తెలిసింది. ఈ మేరకు డీఎస్సీలో భర్తీ చేయనున్న ఉపాధ్యాయ ఖాళీలను నిర్ధారించేందుకు ఆదివారం విజయవాడలో అన్ని జిల్లాల విద్యాధికారులతో సమావేశం నిర్వ హించనున్నారు. ప్రస్తుతానికి అందుబాటులోవున్న సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో పలు సబ్జెక్టు టీచర్ల నియామ కాలకు మాత్రమే డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరిమితం కానుంది. ఎస్జీటీ కేడర్‌లో జిల్లాలో అవసరానికి మించి ఉపాధ్యాయులు ఇప్పటికే ఉండడంతో ఈ కేటగిరీలో కొత్తగా నియామకాలు ఉండకపోవచ్చు. ఇక స్కూల్ అసిస్టెంట్ తెలుగు-19 పోస్టులు, హిందీ-31, ఇంగ్లీషు-26, గణితం-18, ఫిజికల్ సైన్స్-6, బయోలాజికల్ సైన్స్-7, సోషల్‌స్టడీస్-1, ఫిజికల్ డైరెక్టర్-56 పోస్టులు కలిపి 164 ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలు భర్తీఅయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో మొత్తం 2,217 పోస్టులు భర్తీ అవుతాయని భావిస్తున్నారు. మిగతా యాజమాన్యాలైన ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలనుకూడా డీఎస్సీలోనే చేర్చితే ఉమ్మడి జిల్లాలో భర్తీచేసే పోస్టులసంఖ్య కొంతవరకు పెరుగుతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారిక నిర్ణయం తీసుకున్న తర్వాతే డీఎస్సీ-2024కి ఉమ్మడి జిల్లాలో ఎన్ని పోస్టులు నోటిఫై అవుతాయన్నది తెలిసే అవకాశం ఉంది.

'నూతన విద్యావిధానంతో ఖాళీ పోస్టుల్లో కోత'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 : నూతన విద్యావిధానం మార్గదర్శకాల కారణంగానే జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు తగ్గిపోయాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. శుక్రవారం ఏలూరులోని సంఘజిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 117 ఉత్తర్వుల్లోని అసంబద్ధతను తొలగించిడం ద్వారా ఉపాధ్యాయ:విద్యార్థుల నిష్పత్తిని సవరించి డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఖాళీలను పెంచాలని డిమాం డ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో తిరిగి అప్రెంటీస్ విధానాన్ని తీసుకురావాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఒకప్పటి వెట్టిచాకిరీ విధానాన్ని దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తొలగించగా, తాజాగా మళ్లీ అదే విధానాన్ని సీఎం జగన్ తీసుకురావాలనుకోవడం సరైంది కాదన్నారు. సమావేశంలో సంఘ నాయకులు సుబ్బారావు, రాజేంద్ర, ధర్మారావు, శ్రీనివాసరావు, రాజాబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు గుంటూరులో జేఏసీ ఏర్పాటుకు సమావేశం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 : రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న తెలగ, బలిజ, కాపు ఉద్యోగులను ఒకే వేదికపైకి తెచ్చి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేయడానికి ఈనెల 4న ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు కాపు, తెలగ, బలిజ, ఒంటరి అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెట్టి సింహాద్రిరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, అరండల్‌పేట 12వ రోడ్డులోని ఫెర్టిలైజర్స్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఆ రోజున ఉదయం 10 నుంచి 4 గంటల వరకు జరిగే సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, ఉద్యోగులు, వృత్తిదారులు, టీచర్లు, పెన్షనర్లు పాల్గొంటారని వివరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఈ సమావేశానికి పెద్దసంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



చేపలు పట్టడానికి వచ్చిన కూలీలు

నిషేధిత వలలతో చేపల వేట

- భారీగా తరలించుకుపోతున్న మత్స్య సంపద
- అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానిక జాలర్లు

కుక్కునూరు, ఫిబ్రవరి 2 : నిషేధిత వలలతో కుక్కునూరు గోదావరి తీర ప్రాంతంలో ఒక ముఠా మత్స్య సంపదను కొల్లకొడుతోంది. శుక్రవారం స్థానిక జాలర్లు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. కొవ్వూరు ప్రాంతానికి చెందిన కొందరు జాలర్లు కుక్కునూరు గోదావరి తీర ప్రాంతంపై కన్నేశారు. ఈ క్రమంలో బీహార్, జార్ఖండ్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులను కూలీలకు తీసుకువచ్చి నిషేధిత వలలతో చేపలను వేటాడుతున్నారు. ఈ నిషేధించిన వలలను గోదావరి చేపలు పట్టడానికి ఉపయోగిస్తున్న క్రమంలో చేపలు పెట్టిన గుడ్లతో పాటు చిన్నచిన్న చేపలు, పెద్ద చేపలు కూడా వలలో చిక్కుకుంటాయి. అనంతరం ఆ చిన్నచేపలను స్థానికంగా ఎండబెట్టి విక్రయిస్తారు. రోజుకు 5 నుంచి 10 టన్నుల చేపలను వీరివేటలో లభ్యమౌతున్నాయి. కుక్కునూరు మండలంలోని కుక్కునూరు నుంచి కివ్వాక, కొండపల్లి, వింజరం తీర ప్రాంతంలో ఈ చేపల వేట కొనసాగుతుంది. దాదాపు 20 రోజులుగా 40 మందికిపైగా కూలీలు వేటలో పాల్గొంటున్నారు. ఇది ఇలాకొనసాగితే ఉన్న మత్స్య సంపద అంతా పోతుందని స్థానిక జాలర్ల ఆవేదన. ఈ నిషేధిత వలలను సముద్రం, నదుల్లో కూడా ఉపయోగించడానికి వీల్లేదు. ఈ మేరకు కుక్కునూరు పోలీసులకు ఫిర్యాదు అందింది.

మంచు దుప్పటి

భీమవరంటౌన్, ఫిబ్రవరి 2 : భీమవరం పట్టణాన్ని శుక్రవారం తెల్లవారుజామున మంచు దుప్పటిలా కప్పేసింది. ఐదు గంటలకు మంచు కురవడం ప్రారంభమై ఆ తరువాత మరింత పెరిగింది. మంచువాన కురిసినట్టుగా చెట్లనుంచి ఇళ్ల వద్ద నీరు కారడంతో వర్షం వచ్చిననట్టుగా నేల తడిసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం 9 గంటల వరకు మంచు ఉంది. ఉదయం పాఠశాలలు, ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లేవారు కొంతఇబ్బంది పడ్డారు.



భీమవరంలో మంచు దృశ్యం

రానున్న ఎన్నికల్లో జగన్‌కు పరాభవం తప్పదు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2: ప్రజా వ్యతిరేక విధానాలతో నియంతృత్వ పాలన సాగిస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలో పలు చోట్ల శుక్రవారం ప్రజలతో ఆయన భేటీ అయ్యారు. జనసేన పార్టీ విధానాలను తెలియజేస్తూ ప్రచురించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. టీడీపీ-జనసేన కూటమి విజయం సాధిస్తేనే అందరికీ ప్రయోజనం కలుగుతుందని, గ్రామాలు, పట్టణాలు, నగరాలు అభివృద్ధిపథంలో పయనిస్తాయన్నారు. జగన్ మాయమాటలు నమ్మవద్దని, ప్రజల సంక్షేమార్థం కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, బొత్స మధు, అల్లు సాయిచరణ్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్‌గుప్త, వీరంకి పండు తదితరులు ఉన్నారు.

పేదల భూ సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2: జిల్లాలో పేదల భూ సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ పర్యటన నేపథ్యంలో రామకృష్ణ శుక్రవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. అసైన్డ్, సీలింగ్, అటవీ భూముల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో 3వేల ఎకరాల్లో ఎర్రకాల్వ మిగులు భూములను గిరిజనులకు పంచాలన్నారు. పంగిడిగూడెం, దోసపాడు, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో 25 వేల ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. పాతికేళ్ల నుంచి రైతులు, గిరిజనులు, పేదలు పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

జగన్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి : సీపీఎం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు వస్తున్న జగన్‌కు సీపీఎం శుక్రవారం బహిరంగ లేఖ రాసింది. జిల్లాలో ప్రధాన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, సమస్యలు పరిష్కారం చేయని జగన్ జిల్లా పర్యటనకు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు 10 లక్షల ప్యాకేజీ, పూర్తిస్థాయి పునరావాసం హామీ ఏమైందన్నారు. కొల్లేరును మూడవ కాంటూరుకు కుదించి మిగులు భూములు పేదలకు ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎక్కడడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. నూజివీడు మామిడి ప్రొసెసింగ్ యూనిట్ నిర్మాణానికి పునాదులు కూడా పడలేదన్నారు. ఏలూరు స్మార్ట్‌సిటీ ఎక్కడ అని ప్రశ్నించారు. జిల్లాలో అన్ని రకాల రోడ్లు అధ్వానంగా తయారైన కనీస మరమ్మతులు చేయకపోవడం చేతకానితనం అన్నారు.

రైతు సమస్యలపై జగన్ దృష్టి సారించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటనకు వచ్చే ముందు రైతు సమస్యలపై దృష్టి సారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నరసింహ, కె.శ్రీనివాస్ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను శుక్రవారం రైతు సంఘం కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు కూడా న్యాయం చేయలేదన్నారు. పెదవేగి ఆయిల్ ఫ్యాక్టరీ కర్మాగారాన్ని ఆధునీకరించాలన్నారు. మామిడి రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న భోజన కార్మికులు

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 2: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగమణి కోరారు. ఎంఈవోకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుకారుస్తున్నాయన్నారు. ప్రతీ నెల 5వ తేదీ లోపు బిల్లులు ఇవ్వాలని గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగులో ఉన్న బిల్లులు తక్షణమే ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నాయకులు రాంబాబు, రమాదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ ప్రక్రియపై కళాశాల విద్యార్థినులకు శిక్షణ


విద్యార్థినులకు శిక్షణనిస్తున్న వైద్యులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2: ఆకస్మికంగా గుండెపోటుకు గురైనవారిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించేందుకు చేపట్టాల్సిన సీపీఆర్ వైద్య విధానంపై శుక్రవారం రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థినులకు బేసిక్‌లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అవగాహన సదస్సును నిర్వహించారు. సీనియర్ కార్డియాలజిస్టులు మోటూరు ధరణీంద్ర, వెలగా అనూప్ మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారిని సీపీఆర్ ద్వారా రక్షించడంపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శివప్రసాద్, ప్రిన్సిపాల్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, వి.నిఖిల్ మహేష్, సీతారామిరెడ్డి, ఉమా మహేశ్వరరాజు, రత్నాలబాబు, ఏసురాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తితో అనర్థాలపై అవగాహన


ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

పెదవేగి, ఫిబ్రవరి 2: వ్యాధుల నియంత్రణపై అవగాహన ఉంటే ఆరోగ్యం మనవెంటే ఉంటుందని సహాయ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. న్యాయంపల్లి, కూచింపూడి గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. దోమల వ్యాప్తితో కలిగే అనర్థాలు, వ్యాధులు ప్రబలే అంశాలపై గ్రామంలో ప్రదర్శన చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి, వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యకరమైన పరిస్థితులు ఉంటాయని ఆయన చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యవాణి, జయ మాధురి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు పరిరక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 2: చిత్తడి నేలలను పరిరక్షించకుంటే మానవ మనుగడ అసాధ్యమని కొల్లేరు ఉద్యమ నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు రూరల్ మండలంలోని పత్తికోళ్లలంక, గుడివాకలంక గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిత్తనేలల పరిరక్షణ, తీసుకోవాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు చిత్తడి నేలలను పరిరక్షించి పర్యావరణం కాపాడాలని ప్లకార్డుల ద్వారా నినాదాలు చేశారు.

వృద్ధులకు అండగా నిశ్చింత ఆశ్రమం


వృద్ధులతో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 2: తమ పిల్లలు తమ వద్ద లేరని వృద్ధులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిశ్చింత ఆశ్రమం (పట్టణ ప్రభుత్వ వసతి గృహం) వారికి అండగా ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. పత్తేబాద పట్టణ నిరాశ్రయుల వసతిగృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. వారి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రి ఆవరణలో దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను రత్న ప్రసాద్ సందర్శించారు. భార్యా భర్తల మధ్య విబేధాలు రావడంతో వారికి కౌన్సిలింగ్ అక్కడ చేస్తూ ఉండడంతో వెంటనే జడ్జి వారితో మాట్లాడారు. సంసారం సాఫీగా సాగాలంటే భార్యాభర్తలు ఇరువురు సర్దుకు పోవాలని సూచించారు.

రా.. కదలి రా

చింతలపూడిలో చంద్రబాబు సభకు టీడీపీ శ్రేణుల సన్నద్ధం


చింతలపూడిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2: తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమి అధికారంలో రావడానికి కొద్ది రోజులు మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకుడు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. చంద్రబాబు నాయుడు రా కదలిరా పర్యటనలో భాగంగా ఈ నెల 5న చింతలపూడి సభ జయప్రదం చేయాలని జంగారెడ్డిగూడెం పట్టణ, మండల, కామవరపుకోట తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జగన్ రెడ్డి దుర్మార్గ, కక్షపూరిత పాలన ఏవిధంగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందో ప్రజలకు తెలియజేయడానికే ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఘంట మురళీ రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధికారంలోకి రావడానికి సభలను నిర్వహిస్తున్నామన్నారు మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రా కదలిరా సభకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల నుంచి 20వేల మంది కార్లు, బైకులు, బస్సుల ద్వారా వచ్చి సభను జయప్రదం చేద్దామన్నారు. రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, దాసరి శ్యామ్ సుందర శేషు, మేక ఈశ్వరయ్య, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, షేక్ ముస్తఫా, బొమ్మాజీ అనిల్, ఆకుమర్తి రామారావు, సొంగ రోషన్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, తూటికుంట రాము, సూర్య శ్రీను, లక్ష్మణరావు, కుడిపూడి సత్తిబాబు, సింహాద్రి రామకృష్ణ, కుక్కల మాధవరావు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

● చింతలపూడి: రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి టీడీపీకి కంచుకోట అన్నారు. ప్రతీ గ్రామం, ప్రతీ వార్డు నుంచి సభకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చేవిధంగా నాయకులు కృషి చేయాలన్నారు. మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, కొండ్రు దేవ, చీదరాల మధుబాబు, అనీష్‌కుమార్, టీఎస్‌వీ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: చింతలపూడిలో జరిగే రా.. కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. కలరాయనగూడెంలో గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గన్ని వీరాంజనేయులు, ఆరుమిల్లి రాధాకృష్ణ, కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ బహిరంగ సభకు పార్టీశ్రేణులంతా హాజరవ్వాలన్నారు. మండలం నుంచి సుమారు 50వేలమందికి పైగా సభకు తీసుకువచ్చేలా నాయకులు చూడాలన్నారు. నియోజకవర్గం నుంచి లక్షమందికి పైగా హాజరయ్యేలా నాయకులు కృషిచేయాలన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ గ్రామాల్లోని మహిళలను తీసుకువచ్చేలా చైతన్యపరచాలన్నారు. గుత్తా సత్యసాయివరప్రసాద్, నందిగం బాబి, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: చింతలపూడిలో నిర్వహించే రా.. కదలి రా సభకు భారీగా ప్రజలు తరలి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి పిలుపునిచ్చారు. బడేటి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు కాశీనవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. మాజీ ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ సైకో జగన్ పాలనకు ముగింపు సమీపిస్తుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీ మాట్లాడుతూ జగన్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. చోడే వెంకటరత్నం, దాసరి ఆంజనేయులు, ఉప్పాల జగదీష్‌బాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: చింతలపూడిలో రా.. కదలి రా బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్ పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరావు, దాసరి శ్యామ్ చంద్రశేషు, పారేపల్లి రామారావు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, పారేపల్లి నరేష్, బాసిన రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


లింగపాలెంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న సైకో జగన్

కొయ్యలగూడెం: సైకో జగన్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాడని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ విమర్శించారు. శుక్రవారం కొయ్యలగూడెంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ కోసం ఇంటర్ పరీక్షలను వాయిదా వేయడం దారుణమన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమైన తరుణంలో వాయిదా వేయడం సైకో జగన్‌కే సాధ్యమన్నారు. ఏలూరులో శనివారం జరిగే సభకు విద్యార్థులు, తల్లిదండ్రులను రప్పించాలని సెలవు ప్రకటించారన్నారు. ఇటువంటి సంఘటనలు ఎప్పుడు రాష్ట్రంలో జరగలేదని ఈ సందర్భంగా తెలిపారు. సైకో ముఖ్యమంత్రికి ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, జిల్లా తెలుగు యువత నాయకుడు గోపి, వీరపండు, సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని టీడీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు రామారావు అన్నారు. మక్కినవారిగూడెంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి మినీ మేనిఫెస్టో వివరించారు. జనసేన నాయకులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లోకి తెలుగుదేశం పార్టీ వేగంగా దూసుకువెళ్తుందన్నారు. కుంజా లోకేష్, పూనెం ఆదిత్య, తుట్టి చిన్న నాగేశ్వరరావు, పొట్ట సూర్యచంద్రరావు, కొరసా గోపాలరావు, వీరాస్వామి, కుంజా ఆనంద్, చంద్రరావు, మడకం బొజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడలు

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: ఆడుదాం ఆంధ్ర పేరిట నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఏఎస్ఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవం ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించిందన్నారు. జిల్లాస్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులను అందించామన్నారు. జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో గెలిచిన జట్టు ఈనెల 6 నుంచి వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లాకు ఎక్కువ బహుమతులు తీసుకురావాలన్నారు. జేసీ లావణ్యవేణి, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఎస్ఎంఆర్ పెదబాబు, బడేటి వెంకట రామారావు, వినయ్‌ప్రసాద్, ఐ.రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల్లో బిల్లులు తప్పనిసరి


ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

పెదవేగి, ఫిబ్రవరి 2: ఎరువుల క్రయ, విక్రయాల్లో బిల్లులు తప్పనిసరి అని మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. విజయరాయి, బాపిరాజుగూడెం, కొండలరావుపాలెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలు, రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. వెంకటమణి మాట్లాడుతూ దుకాణాల యజమానులు బిల్లులు లేకుండా క్రయ, విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సులు కాలపరిమితి ముగిసిన తరువాత ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీలో పెదవేగి ఏవో ఎం.ప్రియాంక పాల్గొన్నారు.

ప్రమాదాలకు డ్రైవర్లను కారకులను చేయడం దారుణం

కుక్కునూరు, ఫిబ్రవరి 2: ప్రమాదాలకు డ్రైవర్లే కారణమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిరంకుశ హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. హిట్ అండ్ రన్ కేసులో 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తామంటూ చేసిన భారతీయ న్యాయ సంహిత 106(1)(2) చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పోషణ కోసం డ్రైవర్ వృత్తి చేసేవారిని దోషులుగా ఎలా నిర్ధారిస్తారని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలం లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి ఘంటసాల రమేష్, నిమ్మల శివ, గరటం హరీష్, దార కృష్ణ, సూభాన్, ఉదయ్, రాము, సతీష్, వెంకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లా ప్రకటించాలి

పోలవరం, ఫిబ్రవరి 2 : ఏజెన్సీ, ముంపు మండలాలతో కలిపి పోలవరం కేంద్రగా జిల్లా ప్రకటించాలని పోలవరం వర్తక సంఘాలు, ప్రజలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా చేశారు. వర్తక సంఘం నాయకులు నాళం గాంధీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఆరంభం నుండి ఇప్పటి వరకూ పోలవరం మండలంలో వర్తక వాణిజ్యాలు, చిరు వ్యాపారాలు, హోటళ్ళ వ్యాపారాలు పూర్తిస్థాయిలో మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5న జరిగే ప్రత్యేక జిల్లా పోరాట కార్యాచరణ కార్యక్రమంలో వర్తక సంఘాలు, చిరు వ్యాపారులు, ప్రజలు, అన్ని పార్టీల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు జిల్లా కార్యదర్శి సొబ్బన మోహన్, యాసీన్ వర్మ, జమ్మీ, సంధాని, సంధాని తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2: అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు డిమాండ్ చేశారు. మసీద్ సెంటర్‌లో నెల్లిమర్ల అమరవీరుల సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. నెల్లిమర్ల జూట్ కార్మికుల పోరాటంలో ఐదుగురు అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. మద్దిపాటి లక్ష్మయ్య, ముప్పిడి శంకర్, కొత్తురి అబ్బులు, ఉప్పాటి దాసు, ఏలేటి దుర్గయ్య, యండ్రపాటి శ్రీను, కొత్తూరి నల్లవెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2: పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పర్యవేక్షణలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 7 తేదీలలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలియజేశారు. 5న వేలేరుపాడు భూదేవిపేట, 6న కుక్కునూరు పాత రామాలయం, 7న జీలుగుమిల్లి కోదండ రామాలయం వద్ద పారిజాతగిరి నుంచి ప్రత్యేక ఉత్సవమూర్తులను తీసుకొనివెళ్లి శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

చింతలపూడి విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ట్రస్ట్

చింతలపూడి, ఫిబ్రవరి 2: రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రథమ స్థానం సాధించిన చింతలపూడి సుబ్బరాజు పాఠశాల విద్యార్థినులను పలువురు అభినందించారు. విద్యార్థినులు కె.సౌజన్య, ఎం.శ్రీవర్షిణి, కె.మహిత, వారికి శిక్షణ ఇచ్చిన కె.రవికుమార్‌ను రాజీవ్ థామస్ చారిటబుల్ ట్రస్టు, బోడా రాణి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు థామస్, బోడా అనీష్‌కుమార్ అభినందించి అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుకరించారు.

దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) ఓటుహక్కు వినియోగించుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ పీఆర్.మణి తెలిపారు. వెంకటపురంలో ఎలిషా అంధుల గృహం వద్ద ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. బ్రెయిలీ లిపి ద్వారా పొందుపరచబడిన ఓటు నమోదు యంత్రం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయ్యాలన్నారు.

బాలల స్నేహపూరిత గ్రామాలుగా జిల్లాను నిర్మించాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: బాలల స్నేహపూరిత గ్రామాలుగా జిల్లాను నిర్మించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేష్ సూచించారు. ఐసీడీఎస్, రాష్ట్రబాలల హక్కుల కమిషన్, చైల్డ్‌రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బాలల సంరక్షణ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, లైంగిక వేధింపులు చట్టం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. బత్తుల పద్మావతి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు విద్యానగర్ శిశుగృహ నిర్వహణను పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ కేవీఎల్ పద్మావతి, బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి, రెబ్కారాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

టి.నరసాపురం, ఫిబ్రవరి 2: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు అన్నారు. ఏపికుంటలో ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు ఎస్‌వీపీకెహెచ్ సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు కొసకళ్ళ కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పి.అజయ్, మహిళ సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా జ్యోతి, సుధారాణిని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రాజేంద్ర, రాజాబాబు, మోషే, కృష్ణంరాజు, సయ్యద్, రాంబాబు, శ్రీను, పూర్ణ చంద్రరావు, సాగర్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఈ-పంట రికార్డుల పరిశీలన

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 2: బూసరాజుపల్లిలో కరాటం జానకీరామ్ పొగాకు పంటను క్షేత్రస్థాయిలో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పరిశీలించారు. జిల్లాలో 50 మంది రైతుల క్షేత్రాలు సూపర్‌చెక్ నిమిత్తం రాగా దీనిలో భాగంగా జిల్లా అధికారి మండలంలో పర్యటించి పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పీజీ బుజిబాబు, ఏవో బి.సుమలత వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా చుక్కపల్లి గ్రామానికి చెందిన ఆసం బాలరాజు జంగారెడ్డిగూడెంలో బందువుల ద్వారా కిరాణా దుకాణంలో పని చేసేందుకు గురువారం వచ్చాడు. శుక్రవారం శ్రీనివాసపురం హైవే జంక్షన్ దాటుతుండగా రాజమండ్రి వైపు నుంచి వస్తున్న పాల వ్యాన్ ఢీకొంది. బాలరాజుకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆసుపత్రికి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీ సమీపంలో శుక్రవారం పేకాటాడుతున్నారన్న సమాచారంతో తన సిబ్బందితో దాడి చేశారు. ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,650 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మద్దిగుట్టలో పూరిల్లు దగ్ధం

వేలేరుపాడు, ఫిబ్రవరి 2: మద్దిగుట్ట గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. బీరబోయిన రమణమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు రేగాయి. స్థానికులు మంటలను అదుపుచేశారు. అనంతరం ఫైర్‌సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు.


ఏలూరులో బీజేపీ ఎన్నికల ప్రచార రథం ప్రారంభిస్తున్న నేతలు

బీజేపీ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 2: జిల్లాలో బీజేపీ ఎన్నికల ప్రచార రథాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో తపనా ఫౌండేషన్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ శుక్రవారం ప్రారంభించారు. సినీ గేయ రచయిత అనంతశ్రీరామ్ మాట్లాడుతూ ప్రచార వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తామన్నారు. గారపాటి రేణుక, కే.లక్ష్మీకృష్ణప్రసాద్, గుమ్మడి చైతన్య, శివ, గాది రాంబాబు, జబర్దస్త్ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో జబర్దస్త్ ప్రచార కార్యక్రమం

పోలవరం, ఫిబ్రవరి 2 : ప్రముఖ టీవీ షో కమెడియన్లు జబర్దస్త్ బృందం శుక్రవారం మండలంలో బీజేపీ ప్రచార కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల కామెడీ షోలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేసిన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎల్ఎన్‌డీపేట, పట్టిసీమ, గూటాల, పోలవరం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య సినీ పాటలు పాడి అలరించారు. కమెడియన్లు అప్పారావు, అదిరే అభి, బాబీ, వినోదిని, ఇమ్మానుయేలు ప్రదర్శనలు నిర్వహించారు. సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ మాట్లాడుతూ 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన గారపాటి తపన చౌదరిని ఏలూరు పార్లమెంటు సభ్యుడిగా గెలిపిస్తే ఏలూరు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అధిక సంఖ్యలో ప్రజానీకం పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, కృష్ణప్రసాద్, మొడియం శ్రీనివాసరావు, కొండేపాటి రామకృష్ణ, వెంకటలక్ష్మి, వంకా కాంచనమాల, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పన్ను అధిక వసూళ్ల నుంచి ఊరట

జంగారెడ్డిగూడెం, జనవరి 2: పట్టణంలో అడ్డగోలు ఆశీల పన్ను వసూలుపై రెండు రోజులుగా ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనాలతో చిన్న వ్యాపారులకు కొంత ఉపశమనం కలిగింది. నిబంధనల ప్రకారం శుక్రవారం ఆశీల పన్నుల వసూలు చేసినట్టు తెలిసింది. బాధితుల నుంచి మరో అభ్యర్థన వెలుగులోకి వచ్చింది. నిబంధనల ప్రకారం రూ.25 చెల్లించాల్సిన వారి నుంచి రూ.50 గుంజుకునే వారని, రద్దీగా ఉండే గురువారం రూ.70 నుంచి రూ.100 వరకు డిమాండ్ చేసేవారని పలువురు వాపోతున్నారు. ఈ విషయాన్ని కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గురువారం రెట్టింపు వసూళ్లపై అధికారులు ఆరా తీసినా చిన్నవ్యాపారులపై ఒత్తిళ్లు తగ్గుతాయని కోరుకుంటున్నారు.

5న ఆశీల వేలం పాట..

2024-25 సంవత్సరానికి ఈనెల 5న మున్సిపల్ కార్యాలయంలో రోజువారీ ఆశీల వేలం జరగనుందని అధికారులు తెలిపారు. ఇప్పటి నుంచే ఆశీల పాట దక్కించుకునేందుకు కొంతమంది సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎంపీహెచ్ఈవోగా పని చేస్తున్న కొరపాటి కిషోర్‌కు లెక్చరర్‌గా పదోన్నతి లభించింది. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సోషల్, సైన్స్ విభాగంలో లెక్చరర్‌గా బాధ్యతలు చేపట్టారు. కిషోర్‌ను పలువురు అభినందించారు.
- **టి.నరసాపురం :** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈ నెల 8న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. మండల విద్యావనరుల కేంద్రంలో భోజన పథకం కార్మికులతో కలసి శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు.
- **జంగారెడ్డిగూడెం :** పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలోని కొత్తపేటలో మన ఊరు మన వార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి అంజి, కమిషనర్ భవాని ప్రసాద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** మండలంలోని పాఠశాలల హెచ్ఎంలతో ఎంఈవో భాస్కర్‌కుమార్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, నాడు - నేడు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను వివరించారు. విద్యాశాఖ అదనపు డైరెక్టర్ షరీఫ్, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు కుమార్, ఎస్ గౌస్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.
- భీమడోలు మండలంలోని పలువురు అనారోగ్య బాధితులను, నిరుపేద కుటుంబాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మరాజు పరామర్శించారు. భీమడోలులో నాగూర్, షేక్ మాబూకు ఆర్థిక సహాయం అందజేశారు. వడ్లపట్లలో రోడ్డు ప్రమాదానికి గురైన వర్ధినీడి పవన్‌ను పరామర్శించారు. మండల ప్రత్తి మదన్, తదితరులు పాల్గొన్నారు.
- భీమడోలు హైస్కూలులో పలువురు విద్యార్థులకు సర్పంచ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు జన్మదినం సందర్భంగా అభినందనలకు వెచ్చించే పూలబొకేలు, తదితర ఖర్చులతో సేకరించిన పుస్తకాలు, పెన్నులను సర్పంచ్ పాము సునీత మాన్‌సింగ్ హైస్కూలు, అరుంధతీ కాలనీ, అర్జావారిగూడెం పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. జడ్పీటీసీ భవాని, తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు అంబికాదేవికి మహిళలు శుక్రవారం కుంకుమార్చన చేశారు. సౌభాగ్యలక్ష్మీదేవి, బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ, దక్షిణపువీధిలో బాల త్రిపుర సుందరీదేవి, మహిషాసుర మర్ధిని, అగ్రహారంలోని రాజ్యలక్ష్మిదేవి, కన్యకాపరమేశ్వరి, జ్ఞాన సరస్వతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- **కామవరపుకోట :** లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు జరిపారు. దీపారాధనలతో కర్పూర జ్యోతులతో ఆరాధించారు. రాహుకాలంలో శ్రీచక్రానికి గో క్షీరాభిషేకం నిర్వహించారు.

అధికారుల బదిలీలు, చేరికలు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి, నూజివీడు ఆర్డీవో భవాని

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఏలూరు ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.స్వరూపరాణి శుక్రవారం కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. నూజివీడు ఆర్డీవోగా వై.భవాని బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

● ఏలూరు క్రైం: ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2015లో తాడేపల్లిగూడెం టౌన్ సీఐగా పని చేశారు. ఏలూరు జిల్లా సైబర్ క్రైమ్ విభాగం నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

● కామవరపుకోట: ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ డీవీ.సత్యనారాయణ ఏఎస్ఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయనను ఘనంగా సత్కరించారు.

● పెదపాడు: తహసీల్దారు విజయకుమార్ కృష్ణా జిల్లా నందివాడ బదిలీ అయ్యారు. వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తహసీల్దారు విజయకుమార్‌ను శుక్రవారం కార్యాలయం వద్ద సన్మానించారు.

● టి.నరసాపురం: ఎస్ఐగా డి.దుర్గామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. లక్కవరం ఎస్ఐగా పనిస్తూ బదిలీపై టి.నరసాపురం వచ్చారు. ఇక్కడ పని చేసిన బి.సురేంద్ర కుమార్ అగిరిపల్లి బదిలీ అయ్యారు.

● బుట్టాయగూడెం: మండలంలో తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి బదిలీ అయ్యారు. తహసీల్దార్ కృష్ణా జిల్లా గూడూరుకు బదిలీ కాగా ఎంపీడీవో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు బదిలీ అయ్యారు.

● ద్వారకాతిరుమల: ఎస్ఐగా సతీశ్ ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ద్వారకాతిరుమల వచ్చారు. తొలుత చినవెంకన్న ఆలయానికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

● లింగపాలెం: తహసీల్దార్ ఆర్‌వి.మురళీకృష్ణ అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు సన్మానించారు. విధి నిర్వహణలో అండగా నిలిచారన్నారు.

మొండికేసిన ఎండీయూ వాహనం

చౌక డిపోల్లోనే బియ్యం పంపిణీ



ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామంలో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనం కదలలేని స్థితిలో ఉంది. గత నెల 17 నుంచి వాహనాన్ని అప్పటి ఆపరేటర్ వదిలేయటంతో ప్రస్తుతం ఆ వాహనం మొరాయిస్తోంది. దీంతో ఈ నెల ఉచిత బియ్యం ఎండీయు వాహనం ద్వారా ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమానికి బ్రేక్ పడింది. బియ్యాన్ని గ్రామంలోని రెండు చౌక డిపోల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ సక్రమంగా జరగక పోవటంతో గత నెల గ్రామంలోని సుమారు 186 రేషన్ కార్డుల వినియోగ దారులకు జనవరి నెల ఉచిత బియ్యం అందలేదని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి విచారణ జరపగా, ఆపరేటర్ విధులను సక్రమంగా నిర్వహించటం లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేయటంతో అతనిని తప్పించారు. అనంతరం ఎండీయు వాహనం కొత్త ఆపరేటర్‌గా వాసుపల్లి దుర్గారావును నియమించి లాగిన్ ఏర్పాటు చేశారు. వాహనాన్ని కూడా కొత్త ఆపరేటర్‌కు స్వాధీనం చేశారు. అయితే ఆ వాహనం ఇంజన్‌లో లోపం ఏర్పడటంతో ముందుకు కదలటం లేదు. చిన్న రిపేర్లతో ఆపరేటర్ ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. వాహనం మరమ్మతులకు రూ.5 వేలకుపైగా ఖర్చు అవుతుందని మెకానిక్ అంచనా వేయటంతో దానిని గ్రామ శివారు సూర్యనారాయణపురంలోనే వదిలేసి కొత్తగా నియమితుడైన ఎండీయు ఆపరేటర్ చౌక డిపోలోనే ఈ నెల బియ్యం పంపిణీని నిర్వహిస్తున్నారు.

గత నెల కోటా హుళక్కే..

జనవరి నెలలో గ్రామంలో 186 రేషన్ కార్డుల వినియోగదారులకు నిలిచిపోయిన ఉచిత బియ్యం పంపిణీని చేపట్టే అవకాశాలు లేకుండా పోయాయి. గత నెలలో గడువు ముగిసిందన్న కారణంగా బియ్యం పంపిణీ నిలిపేశారు. ఫిబ్రవరి నెల బియ్యం పంపిణీని చేపట్టారు.

బుసక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : పెదగొన్నూరు గ్రామంలో శుక్రవారం రాత్రి బుసక రవాణా టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామం నుంచి టిప్పర్లు వెళ్లటం వల్ల తమ ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ గ్రామానికి చెందిన పంద్రంకి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు టిప్పర్ లోడును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బుసక రవాణాదారులకు, గ్రామస్థులకు మధ్య ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించి టిప్పర్లను ఆపేశారు.

కార్మిక, కర్షక వ్యతిరేక ప్రభుత్వాల్ని గద్దె దించాలి



ముసునూరు, ఫిబ్రవరి 2: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రమణక్కపేటలో కార్మిక, కర్షకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ ఉద్యమంతో దిగొచ్చిన మోదీ నేటికీ నల్ల వ్యవసాయ చట్టాలు రద్దు, నూతన విద్యుత్ బిల్లు ఉపసంహరణ, ఉద్యమంలో మరణించిన 750 మందికి పరిహారం హామీలను నేర్చవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని, అంబానీలకు రూ. 14 లక్షల 50 వేల కోట్లకు పైగా రాయితీలను కల్పించిన మోదీ ప్రభుత్వం అప్పుల్లో ఉన్న రైతాంగానికి కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టాన్ని అమలు చేయాలని రైతాంగం కోరుతన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త బంద్‌ను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వేముల బక్కయ్య, పాముర్తి రామారావు, రాజేశ్వరి, భవాని, చంటి, చినబాబు, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్ ప్రారంభం

కలిదిండి, ఫిబ్రవరి 2 : ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్‌ను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ అన్నారు. శుక్రవారం కలిదిండిలో రూ.84 లక్షలతో నిర్మించిన ఫిష్ ఆంధ్రా ఆక్వా హబ్‌ను ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన చేపలను తక్కువ ధరకు అందించే ఉద్దేశ్యంతో వీటిని ఏర్పాటు చేశామని, ఇది రాష్ట్రంలో రెండో పెద్ద ఫిష్ ఆంధ్రా హబ్ అన్నారు. అనంతరం కలిదిండి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మారుతి ప్రసన్న, ఎంపీటీసీ సుమన్, సొసైటీ ఛైర్మన్ వడుపు రామారావు, మత్స్యశాఖ ఏడీ చాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి దశలో నైతికత - మానవ విలువలు అనే అంశాలపై జరుగుతున్న ఈ పరీక్షలకు ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 21 మంది, వీఆర్ కళాశాలలో 16 మంది, వికాస్ జూనియర్ కళాశాలలో 76 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు హాజరయ్యారు. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జాస్మిన్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగగా, 26 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. శనివారం జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్ష ఈ నెల 23కు వాయిదా పడింది.

పోస్టల్ ప్రమాద బీమా పరిహారం అందజేత



మండవల్లి, ఫిబ్రవరి 2: మండవల్లికి చెందిన గూడవల్లి రాజేంద్ర ఇటీవల ప్రమాదానికి గురవడంతో పోస్టల్ బీమా ద్వారా వచ్చిన సొమ్మును భైరవపట్నానికి చెందిన పోస్ట్‌మేన్ గుండు సీతారామాంజనేయులు శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పోస్ట్‌మన్ మాట్లాడుతూ రాజేంద్ర 2022లో రూ. 399 చెల్లించి ప్రమాద బీమా పాలసీ తీసుకున్నాడని, 2023లో ఆయన ప్రమాదానికి గురై కాలికి శస్త్ర చికిత్స చేయించుకోగా పరిహారం రూ. 35,216లు బాధితుడికి అందజేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, ఫిబ్రవరి 2: అక్కిరెడ్డిగూడెంలో పేకాట శిబిరంపై ఎస్ఐ వాసు తన సిబ్బందితో కలసి శుక్రవారం దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 2000 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గట్టెక్కేదెలా..?

- నీరివ్వలేమని చేతులెత్తేసిన అధికారులు
- ప్రశ్నార్థకంగా మినుము సాగు
- సాగు నీరివ్వకుంటే పంట దక్కదని రైతుల ఆవేదన



పెదగొన్నూరులో భూమి బీటలు వారి ఎండిపోతున్న మినుము పైరు

నీటి ఎద్దడితో అపరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టిన రైతులు నీరు పుష్కలంగా అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. సాగుకు సరిపడ నీరు అందించలేమని ఇరిగేషన్ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తుండటంతో మినుము సాగు చేస్తున్న రైతులు మరింత కలవరపడుతున్నారు.

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : పోల్‌రాజ్, క్యాంపె బెల్ తదితర ఛానల్స్ కింద ఈ ఏడాది కైకలూరు నియోజకవర్గంలో సుమారు 16 వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఒక్క ముదినేపల్లి మండలంలోనే 12 వేల ఎకరాల్లో ప్రస్తుతం అత్యధిక శాతం విస్తీర్ణంలో మినుము పైరు పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో పైరుకు నీటి తడి చాలా అవసరం. అయితే కాల్వల ద్వారా నీటి విడుదల తగ్గిపోవటంతో పొలాలు బీటలు వారటమే కాక, మినుము పైరు ఎండిపోతున్నది. సరిపడ తడి లేకపోవటంతో పైరు తెగుళ్ల బారిన పడుతున్నది. మినుము సాగుకు ఇప్పటి వరకు ఎకరానికి రూ.15 వేలు ఖర్చు చేశారు. గత ఏడాది డిసెంబరు రెండవ వారం నుంచి 50 రోజులపాటు మినుమును పెంచిన రైతులు మరో 20 రోజులపాటు కష్టపడితే పంట చేతికి దక్కుతుంది. ప్రస్తుత కీలక సమయంలో పైరును కాపాడుకునేందుకు సాగునీరు ఎంతో అవసరం. చివరి దశలో రైతులకు సాగునీటి కష్టం ఎదురయింది. కాల్వలకు నీరు విడుదల పెంచాలని రైతులు ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించటం లేదు. పోల్ రాజ్ కెనాల్‌కు 80 క్యూసెక్కులు, క్యాంప్ బెల్ కెనాల్‌కు 55 క్యూసెక్కులు, బంటుమిల్లి కెనాల్‌కు 90 క్యూసెక్కుల నీటిని గుడ్లవల్లేరు లాకుల వద్ద పుల్లేరు వద్ద విడుదల చేస్తున్నారు. ఈ నీరు కాల్వల్లో పారుతోందే తప్ప బ్రాంచి కాల్వల ద్వారా పొలాలకు చేరటం లేదు. దీంతో నీరందక మినుము పైరు ఎండుతోంది. కాల్వలకు నీరు విడుదలను పెంచే విషయంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. పొలాలకు నీరందించ లేమని స్పష్టం చేస్తున్నారని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం నీటి విడుదల కోసం గుడ్లవల్లేరు లాకుల వద్దకు వెళ్లిన ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు రైతులకు చేదు అనుభవం ఎదురైంది. ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరికి నీటి కోసం ఫోన్ చేయగా, తాగేందుకే నీరు లేదు.. పొలాలకు నీరివ్వటం సాధ్యం కాదని సమాధానం చెప్పారని వాపోయారు.



క్యాంప్‌బెల్ కాల్వలో అడుగంటిన నీరు

నీరు లేకుంటే తీవ్ర నష్టం



ప్రస్తుత సమయంలో కాల్వలకు నీటి విడుదల తగ్గించేశారు. అధికారుల చుట్టూ తిరిగినా సరైన స్పందన లేకపోగా, పొలాలకు నీరివ్వలేమని అంటున్నారు. ఇప్పుడు పైరును కాపాడుకునేదెలా?

-కౌనం ప్రసాద్, రైతు బొమ్మినంపాడు

సార్వాలోనూ నష్టపోయాం..



మినప సాగు రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. ప్రధాన కాల్వల్లో నీరు అడుగంటింది. తుపానుకు సార్వా వరి పంట నష్టపోయిన రైతులకు మినుము సాగు అగమ్య గోచరంగా మారింది. కాల్వలకు నీటి విడుదల పెంచాలి.

-సోమా మోహనరావు, రైతు, ముదినేపల్లి





కైకలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు.. నూజివీడులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల

రా.. కదలిరా విజయవంతం చేయండి

కైకలూరు, ఫిబ్రవరి 2: చింతలపూడిలో ఈ నెల 5న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగే 'రా.. కదలిరా' కార్యక్రమానికి వేలాదిమంది కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎంపీ మాగంటి బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కైకలూరు పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు బహిరంగ సభకు 2 లక్షల మందిని సమీకరిస్తున్నామని, కైకలూరు నియోజకవర్గం నుంచి కనీసం 20 వేల మంది సభకు తరలిరావాలని రావాలన్నారు. దీనికి మండల పార్టీల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, టీడీపీ కుటుంబ సభ్యులు అందరూ కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇటీవల కైకలూరులో జరిగిన జయహో బీసీ సభను విజయంతం చేసిన అందరికీ అభినందనలు తెలిపారు.

జగన్ జైలుకు సిద్ధం

ఏలూరులో ఈ నెల 3న సీఎం జగన్మోహనరెడ్డి సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్నారని సిద్ధం అనే పదం ఆయన జైలుకు వెళ్లేందుకు సిద్ధం అన్నట్టు ఉందని మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు. జగన్‌పై ఆయన సోదరి షర్మిల తిరుగుబాటు చేశారంటే ప్రజలు ఆయన నియంతృత్వ పాలనను గుర్తించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కైకలూరు నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ రాజు, పోకల జోగిరాజు, నారగాని నాగేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త నాగేంద్రబాబు, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, అంద్రాజు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు వల్లభనేని శ్రీనివాసచౌదరి, తాడినాడ బాబు, ఎస్సీ సెల్ నాయకులు జోసఫ్ తంబి, చాబత్తిన విజయ్, తెలుగు యువత నాయకులు దావు నాగరాజు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చంద్రబాబు వివరిస్తారు..

నూజివీడు: చింతలపూడిలో రా కదలిరా సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో వీరు మాట్లాడుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, జగన్ పాలనలో జరిగిన విధ్వంసంపై సభలో చంద్రబాబు వివరిస్తారన్నారు. నూజివీడు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు సభకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర నేత ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నాడు చంద్రబాబు శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టగా, జగన్ ఈ పథకాన్ని మూల పడేసి రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించాడన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గింజుపల్లి రమేష్, రా కదలిరా ప్రోగ్రాం పరిశీలకుడు దొంతు చిన్నా, చిరుమామిళ్ళ సూర్యనారాయణ, అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అట్లూరి రవీంద్ర, నూజివీడు మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు దేవినేని డేలారామ్, పార్టీ మండల అధ్యక్షుడు ముసునూరు రాజా, కొండా మంగయ్య, గోపిశెట్టి కుమార్, నూతక్కి వేణు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తెలుగు యువత నాయకులు

మెగా డీఎస్సీ పేరుతో దగా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2: మెగా డీఎస్సీ పేరుతో జగన్ దగా చేస్తున్నారని టీడీపీ నూజివీడు కార్యాలయం వద్ద తెలుగు యువత చెవిలో పూలు పెట్టుకుని జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో వేలాది టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ ఇస్తానని హామీ ఇచ్చారని, ఐదేళ్ళు కాలక్షేపం చేసి ఇప్పుడు నిరుద్యోగ యువతను మరోసారి మోసం చేసేందుకు డీఎస్సీ ఫేక్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఈ సందర్భంగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను విస్మరించిన ఈ ప్రభుత్వాన్ని త్వరలో సాగనంపుతామని ప్రతిజ్ఞ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గద్దె రఘుబాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు హరికోటి సంగీతరావు, గోగినేని మధుకిరణ్, టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ళ గోపాలకృష్ణ, అట్లూరి వెంకట రవీంద్ర, నూతక్కి వేణుగోపాలరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2: నూజివీడు కోర్టుహాలు వద్ద ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆస్తి హక్కులను ప్రశ్నార్థకం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణం రద్దుచేయాలని, లేకపోతే యజమానులే తమ భూములపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని న్యాయవాదులు నినాదాలు ఇచ్చారు. యాక్ట్ రద్దు జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇందుపల్లి సత్యప్రకాష్, మదుపల్లి మధు రవిశంకర్, న్యాయవాదులు గోళ్ళప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడుకు కామినేని అభినందన



కైకలూరు, ఫిబ్రవరి 2: పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపికైన మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ వెంకయ్య నాయుడుకు మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. శుక్రవారం హైదరాబాదు లోని వెంకయ్యనాయుడు నివాసంలో కలసి మరిన్ని అవార్డులను అందుకోవాలని అభిలషించినట్టు కామినేని తెలిపారు.



చావలిపాడులో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న డీపీవో

మంచినీటి చెరువుపై వివాదాలు వద్దు

» డీపీవో శ్రీనివాస విశ్వనాథ్

మండవల్లి, ఫిబ్రవరి 2: మండవల్లి మండలం చావలిపాడులోని మంచినీటి చెరువు వ్యవహారంలో అందరూ కలసికట్టుగా వివాదాలకు తావులేకుండా సహకరించాలని డీపీవో శ్రీనివాస విశ్వనాథ్ కోరారు. శుక్రవారం చావలిపాడు మంచినీటి చెరువును ఆయన అధికార బృందంతో కలిసి పరిశీలించారు. చావలిపాడు గ్రామంలో 2500 వరకు జనాభా నివశిస్తుండగా కేవలం రెండు ఎకరాలు మాత్రమే మంచినీటి చెరువుగా ఉండడం వల్ల తాగునీరు సరిపోవడం లేదని పంచాయతీ పరిధిలోని మరో 14 ఎకరాలు చెరువును మంచినీటి చెరువుగా మార్చాలని పంచాయతీ తీర్మానం చేయడంతో వివాదాస్పదమైంది. పంచాయతీ పరిధిలోని 14 ఎకరాలు సొసైటీ ఆధీనంలో ఉండడం వల్ల ఆ చెరువును మంచినీటి చెరువుగా మార్చేందుకు సొసైటీ సభ్యులు నిరాకరిస్తూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మంచినీటి చెరువు వ్యవహారం ఇరువర్గాల మధ్య వివాదాస్పదంగా మారింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వివాదం పరిష్కరించేందుకు అధికారుల బృందంతో డీపీవో శుక్రవారం పరిశీలించారు. నివేదిక కలెక్టరుకు అందజేస్తామని ఆయన తెలిపారు. డీపీవోతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ చెక్కు అందజేత

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : కొర్రగుంటపాలెం బీసీ ఏరియాలో నిర్మాణంలో ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయానికి టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వాణి ట్రస్టు 50 శాతం నిధులను విడుదల చేసింది. ఈ ఆలయ నిర్మాణానికి ట్రస్టు రూ.10 లక్షలు మంజూరు చేయగా, రూ.5 లక్షల నిధులు విడుదల చేసింది. ఇందుకు సంబంధించి చెక్కును ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు శుక్రవారం ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షులు అచ్యుత రాంబాబు, సర్పంచ్ పేరే రామకృష్ణ, ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై భిన్న స్వరం

చాట్రాయి, జనవరి 2: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై వివిధ రాజకీయ పార్టీల నుంచి మిశ్రమ స్పందన లభించింది.

తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపుపై ప్రస్తావించకపోవటం, ఉన్నత విద్యకు కేటాయింపుల్లో కోత, పన్ను రేట్లలో మార్పు లేకపోవటం నిరాశ కలిగించిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి చంటి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవటం, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం వంటి అనేక అంశాలు ప్రస్తావించక పోవటం వల్ల ప్రజలకు పెద్దగా ఉపయోగం ఉండదన్నారు.

సీపీఎం మండల నాయకుడు కొమ్ము ఆనందం మాట్లాడుతూ కేంద్ర మధ్యంతర బడ్జెట్ వలన గ్రామీణ పేదలకు మేలు జరగదని, షరా మామూలుగా రైతులకు మొండి చేయి చూపి, కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చారని విమర్శించారు.

బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, నాయకులు గడ్డం సంజీవరెడ్డి, కె ముత్తారెడ్డి మాట్లాడుతూ మౌలిక రంగాలకు పెద్దపీట వేయటం, ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్ళు, ఆయుష్మాన్ భారత్‌ను అంగన్వాడీలు, ఆశాలకు వర్తింపజేయడం, బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ టీకా మొదలైన నిర్ణయాలు దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తాయని హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో భవానీ శంకరి



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2: నూజివీడు ఆర్డీవోగా వై.భవానీ శంకరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ్ రాజేంద్రన్ సాధారణ బదిలీల్లో నెల్లూరు జేసీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో తిరుపతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వై.భవానీ శంకరిని నూజివీడు ఆర్డీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్‌ను కలసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు.

ఆగిరిపల్లిలో ఎంపీడీవో, ఎస్ఐ బాధ్యతల స్వీకారం



ఎంపీడీవో శామ్యూల్



ఎస్ఐ సురేంద్ర కుమార్

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 2: ఆగిరిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నిడదవోలు నుంచి బదిలీ అయిన పి.శామ్యూల్ బాధ్యతలు చేపట్టారు. ఆగిరిపల్లి నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.సురేంద్రకుమార్ టి.నరసాపురం నుంచి ఆగిరిపల్లి స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా కుమారి

ముదినేపల్లి, ఫిబ్రవరి 2 : ముదినేపల్లి తహసీల్దార్‌గా ఎస్ఎల్ఎన్ కుమారి నియమితులయ్యారు. ఇక్కడి తహసీల్దార్ శ్రీనివాస్ పశ్చిమ గోదావరి జిల్లా బదిలీ కావటంతో తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట నుంచి ఆమె ముదినేపల్లి బదిలీపై వచ్చారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి : కాపా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 2: టీడీపీ అభివృద్ధి కోసం, నూజివీడులో టీడీపీ జెండా ఎగుర వేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అధిష్టానం ఎవరికి టిక్కెట్ ఇచ్చినా టీడీపీ గెలిచేలా కృషి చేయాలన్నారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ పసుపులేటి జగన్, తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు అక్కినేని చందు, నూజివీడు మాజీ ఎంపీపీ తొమ్మండ్రు శ్రీనివాసరావు, బీసీ నాయకుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, మిట్టగూడెం సర్పంచ్ కొనకళ్ళ నరసింహారావు, బడిపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొఠాయికి మరమ్మతులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 2: పెద్దకొఠాయికి తక్షణం మరమ్మతులు చేయిస్తామని తిరునాళ్ళ ప్రారంభంలోపు రంగులు వేసి ముస్తాబు చేస్తామని సిమెంట్ ప్యాచ్ వర్క్‌లు కూడా చేస్తామని ఆగిరిపల్లి వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో భవానీ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులు



కలిదిండి, ఫిబ్రవరి 2: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానో పాధ్యాయుడు ఎ.శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్‌లో జరిగిన ఈ పరీక్షల్లో 8వ తరగతి విద్యార్థినులు టి.శ్రావణి, కె.కుసుమ నాగవల్లి, జి.భార్గవి ఎంపికయ్యారని, వీరికి కేంద్రం నుంచి ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



మాట్లాడుతున్న రేంజర్ కుమార్

మానవాళి మనుగడకు..

చిత్తడి నేలలను పరిరక్షించాలి

చిత్తడి నేలల దినోత్సవంలో వక్తలు

కైకలూరు, ఫిబ్రవరి 2: మానవాళి మనుగడకు చిత్తడినేలలు దోహదపడతాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కైకలూరు అటవీశాఖ రేంజర్ కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని కైకలూరు మార్కెట్ యార్డ్ నందు రైతు కల్యాణ మండపంలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి, అటవీ శాఖ, జియాలజికల్, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఏడాది మానవ శ్రేయస్సు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రహనే సుల్తాన్, బొటానికల్ పర్యావరణ నిపుణుడు ఎల్ రసింగం మాట్లాడుతూ ఇప్పటికే ప్రపంచంలో 35 శాతం చిత్తడినేలలు కాలుష్య కోరల్లో చిక్కుకుపోయాయని వీటిని కాపాడుకోవడం వలన సృష్టిలో జీవరాశులకు మనుగడ ఉంటుందని వాటితో పాటు మానవులకు ఈ చిత్తడినేలలు ఎంతో అవసరమన్నారు. రేంజర్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 162 చిత్తడి నేలలు గుర్తించామని గ్రామాల్లో ఉండే చెరువులు సైతం చిత్తడి నేలలేనని వీటిపై అవగాహన కల్పించేందుకు 60 మంది చిత్తడి నేలల మిత్రాలుగా ఏర్పాటు చేశామని వీరు ప్రతి గ్రామంలో పర్యటించి చిత్తడి నేలలపై అవగాహన కల్పిస్తున్నారని ఈ కార్యక్రమాన్ని పూర్తిగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొల్లేరు సరస్సు కాలుష్య వ్యర్థాలతో స్వరూపాన్ని కోల్పోతోందని దానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. లోకుమూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చిత్తడి నేలలు-మానవశ్రేయస్సు అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. సర్పంచ్ డీఎం నవరత్న కుమారి, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిత్తడి నేలల దినోత్సవంలో ప్రతిన